నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దిన పత్రిక
RNI - TELTEL/2023/87644
సంచిక : 42 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | శనివారం | 20-06-2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00

**నీలగిరి నిత్యపద్యం**
ఆటవెలది (సమస్యాపూరణం)

కరమునందు ధనువువెంట కలిగియుండు,
రమణిసీతయు తోడుగా రాఘవునకు
ఎడమవైపున ప్రక్కనే యెప్పుడైన
భార్యలిరువురు శ్రీరామ భద్రునకును

మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి

**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా
WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.



# నీట్ రీ ఎగ్జామ్ యథాతథం

## స్టే ఇచ్చేందుకు సుప్రీం నిరాకరణ

- టెలిగ్రామ్ యాప్ నిషేధానికి ఓకే
- కేంద్ర నిర్ణయానికి ఢిల్లీ హైకోర్టు మద్దతు
- అడ్మిట్ కార్డులపై ఎన్టీఏ కీలక నిర్ణయం

**న్యూఢిల్లీ,**
దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్ యూజీ పరీక్షల వివాదంపై సుప్రీంకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. జూన్ 21న జరగబోయే 'నీట్' రీ ఎగ్జామ్ కు కేవలం 1 రోజుల సమయం మాత్రమే ఉన్న నేపథ్యంలో.. పరీక్షకు సంబంధించిన పలు పిటిషన్లను అత్యవసరంగా విచారించేందుకు అత్యున్నత ధర్మాసనం నిరాకరించింది. అయితే, జూన్ 21న జరగనున్న నీట్ టెస్టును నిలిపివేయాలని, వాయిదా వేయాలని కోరుతూ పెద్ద ఎత్తున పిటిషన్లు దాఖలయ్యాయి. -మిగతా 2 లో



### భూవివాదాలు లేని తెలంగాణ
# నిర్మాణమే లక్ష్యం

- రాష్ట్రంలో దశల వారీగా భూముల రీసర్వే
- వచ్చేనెల నుంచి తొలిదశలో 2240 గ్రామాల్లో ప్రారంభం
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**హైదరాబాద్**
భూ సమస్యలు, భూవివాదాలు లేని తెలంగాణను నిర్మించాలనే లక్ష్యంతో గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో భూ సర్వే నిర్వహించాలని కీలక నిర్ణయం తీసుకుందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా భూముల రీసర్వే కార్యక్రమాన్ని వచ్చే నెల నుంచి దశల వారీగా ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. శుక్రవారం నాడు రెవెన్యూ అధికారులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో మంత్రి గారు మాట్లాడుతూ రాష్ట్రంలో మొత్తం 10,954 రెవెన్యూ గ్రామాలుండగా తొలి దశలో హైదరాబాద్ మినహా మిగిలిన 32 జిల్లాల నుంచి 70 గ్రామాల చొప్పున మొత్తం -మిగతా 2 లో

### పాఠశాలల్లోనే
# దేశ భవిష్యత్

## కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి

- ఎల్బీ స్టేడియంలో 'యంగ్ ఇండియా ఎడ్యుకేషన్ కిట్స్' పంపిణీ
- విద్యాశాఖ బాధ్యతలు నా సొంత పర్యవేక్షణలోనే..
- గత పాలకుల నిర్వాకంతో విద్యావ్యవస్థ తీవ్రంగా విధ్వంసం
- బడ్జెట్‌లో విద్యకు 8.5 శాతం నిధుల కేటాయింపు
- 'నో అడ్మిషన్' బోర్డులు పెట్టే స్థాయికి సర్కారు బడులు
- ప్రతి నెలా ఒకటో తేదీనే విద్యార్థులకు కాస్మెటిక్ ఛార్జీలు
- ఎల్బీ స్టేడియం కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్,జూన్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
దేశ బవిష్యత్ పాఠశాలల్లోనే ఉందని గ్రహించి, అందుకు అనుగుణంగా తెలంగాణ విద్యావిధానంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టామని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. కార్పోరేట్ స్కూళ్లకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చి దిద్దుతున్నామని అన్నారు. పేదలు ఆత్మన్యూన తకు లోనుకకాకుండా వారి పిల్లలకు కూడా ప్రైవేట్ తరహా విద్యను అందిస్తున్నామని అన్నారు. అందుకోసం విద్యార్థులు ఆత్మగౌరవంతో పాఠశాలకు వెళ్లేందుకు ఎడ్యుకేషన్ కిట్లను పంపిణీ చేస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. విద్యపై నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తున్నామని చెప్పారు.
-మిగతా 2 లో










### హైదరాబాద్‌లో జనసేన నూతన
# కార్యాలయం ప్రారంభం

- పార్టీ జెండాను ఆవిష్కరించిన పవన్ కళ్యాణ్
- మల్కం చెరువు సమీపంలో సరికొత్త ఆఫీస్
- గ్రేటర్ ఎన్నికల్లో ఒంటరిగానే జనసేన పోటీ
- క్యాడర్‌ను సిద్ధం చేసేందుకే కొత్త కేంద్రం
- త్వరలోనే పవన్ కళ్యాణ్ తెలంగాణ పర్యటన
- చేరికల కోసం త్వరలో 'జాయినింగ్స్ కమిటీ'
- తెలంగాణపై పొలిటికల్ రోడ్‌మ్యాప్‌తో జనసేన వ్యూహాలు

**హైదరాబాద్,**
హైదరాబాద్‌లో జనసేన పార్టీ కార్యాలయం ప్రారంభం అయ్యింది. పార్టీ అధినేత, ఎపి డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ కార్యాలయాన్ని ప్రారంభించారు. హైదరాబాద్‌లోని మణికొండ మల్కం చెరువు సమీపంలో నూతనంగా నిర్మించిన జనసేన తెలంగాణ రాష్ట్ర కార్యాలయం శుక్రవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలతో అధికారికంగా ప్రారంభమైంది. జనసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యాలయ ప్రారంభోత్సవం సందర్భంగా పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ జనసేన జెండాను ఆవిష్కరించి కార్యాలయంలోకి అడుగుపెట్టారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం తెలంగాణ తల్లి చిత్రపటానికి నమస్కరించి, రాష్ట్ర నాయకులతో ముచ్చటించారు. రాబోయే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (ఉఊఓఅ) ఎన్నికల్లో జనసేన పార్టీ బరిలోకి దిగుతుందని పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఇప్పటికే స్పష్టం చేశారు. ఒంటరిగానైనా సరే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో పోటీ చేస్తామని, క్షేత్రస్థాయిలో పార్టీకి బలం పెంచేందుకు త్వరలోనే తానే స్వయంగా తెలంగాణవ్యాప్తంగా పర్యటిస్తానని ఆయన ప్రకటించారు. ఈ క్రమంలోనే గ్రేటర్ ఎన్నికలను ఒక సవాల్‌గా తీసుకుని క్యాడర్‌ను సమాయత్తం చేసేందుకు ఈ నూతన కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వంలో కీలక భాగస్వామిగా మారిన జనసేన పార్టీ.. తెలంగాణపై తన రాజకీయ దృష్టిని కేంద్రీకరించింది. -మిగతా 2 లో



### నేడు అన్నదాత సుఖీభవ
# నిధుల విడుదల

- రూ.3,125 కోట్లు పంపిణీకి రంగం సిద్ధం
- 46.85 లక్షల మంది రైతు కుటుంబాలకు లబ్ధి
- లింగంగుట్లలో అందచేయనున్న సిఎం చంద్రబాబు

**అమరావతి,జూన్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రాష్ట్రంలోని రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు అన్నదాత సుఖీభవ నిధులను ఎపి ప్రభుత్వం నేడు విడుదల చేయనుంది. శనివారం పల్నాడు జిల్లా చిలకలూరిపేట నియోజకవర్గంలోని లింగం గుంట్లలో జరిగే కార్యక్రమంలో ఈ నిధులను సీఎం చంద్రబాబు నాయుడు విడుదల చేయనున్నారు. 2026-27 ఆర్థిక సంవత్సరంలో తొలి విడత నగదును -మిగతా 2 లో



### కేంద్రం నిర్ణయించిన పంటలే కొంటే
# ఇక మీరెందుకు?

- రాహుల్ గాంధీ పుట్టినరోజే రైతు డిక్లరేషన్‌ను బొందపెట్టిన సీఎం
- వరంగల్ వేదికగా ఇచ్చిన బోనస్ హామీ ఏమైంది?
- రేవంత్ సర్కార్ నిర్ణయంతో దళారుల దయపై ఆధారపడాల్సిన స్థితి
- ఎకరానికి రెండు బస్తాల యూరియా మాత్రమేనా.. మంత్రులకు చిన్నచూపు!
- 45 రోజుల్లో రైతుబంధు అన్నారు.. 90 రోజులైనా అందని నిధులు
- ప్రీమియం కట్టకపోవడంతో 7,600 మందికి అందని రైతు బీమా
- మీడియా సమావేశంలో ప్రభుత్వంపై హరీష్ విమర్శలు

**సిద్దిపేట, జూన్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కేంద్రం కనీస మద్దతు ధర నిర్ణయించిన పంటలను మాత్రమే కొంటామంటే ఇక మీరెందుకని అధికార కాంగ్రెస్ పార్టీ నేతలను బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు సూటిగా ప్రశ్నించారు. పేపర్ లెస్ కేబినెట్ అన్నారని.. కానీ మీది విశ్వాసం లేని కేబినెట్ అని అభివర్ణించారు. మీది విశ్వాఘాతుక ప్రభుత్వమని రేవంత్ రెడ్డి సర్కారుపై నిప్పులు చెరిగారు. పంట కొనుగోలుపై కాంగ్రెస్ సర్కార్ చేతులెత్తేసిందని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ జన్మదినం నాడు రైతులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విషం కక్కారని మండిపడ్డారు. శుక్రవారం సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. వరంగల్‌లో రాహుల్ గాంధీ రైతు డిక్లరేషన్ ప్రకటించారని గుర్తు చేశారు. -మిగతా 2 లో



# అమెరికా-ఇరాన్..చర్చలకు బ్రేక్!

- జేడీ వాన్స్ స్విట్జర్లాండ్ పర్యటన రద్దు
- రాత్రికి రాత్రే ప్రకటించిన వైట్ హౌస్
- లెబనాన్ పై ఇజ్రాయెల్ భీకర దాడులు
- అమెరికా, ఇజ్రాయెల్ మధ్య విభేదాలు
- హెజ్బుల్లాతో ఇజ్రాయెల్ భీకర పోరాటం


**న్యూఢిల్లీ,**
అంతర్జాతీయంగా అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్న అమెరికా, ఇరాన్ దేశాల మధ్య జరగాల్సిన కీలక చర్చలు హఠాత్తుగా రద్దయ్యాయి. స్విట్జర్లాండ్ లోని బర్గెన్ స్టాక్ పర్వత ప్రాంత రిసార్ట్ లో శుక్రవారం జరగాల్సిన ఈ చర్చలు నిలిచిపోయినట్లు స్విస్ విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికారిక ప్రకటనలో వెల్లడించింది. కాగా, అమెరికా వైస్ ప్రెసిడెంట్ జేడీ వాన్స్ తన స్విట్జర్లాండ్ పర్యటనను రద్దు చేసుకున్నట్లు వైట్ హౌస్ ప్రతినిధి రాత్రికి రాత్రే ప్రకటించడంతో ఈ చర్చలు నిలిచిపోయాయి. అమెరికా-ఇరాన్
-మిగతా 2 లో

### మూసీ రివర్‌ఫ్రంట్‌కు కేంద్రం
# గ్రీన్ సిగ్నల్

## అనుమతులు ఇస్తూ రక్షణ శాఖ ఉత్తర్వులు జారీ

- రూ.533.42 కోట్ల విలువైన 83.81 ఎకరాల డిఫెన్స్ భూమి అప్పగింత
- అనుమతులపై సిఎం రేవంత్ రెడ్డి హర్షం
- కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు కృతజ్ఞతలు

**హైదరాబాద్ జూన్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తెలంగాణ ప్రభుత్వం తలపెట్టిన మూసీ రివర్‌ఫ్రంట్ అభివృద్ధికి కీలక ముందడుగు పడింది. గాంధీ సరోవర్ ప్రాజెక్ట్ అమలుకు కేంద్రం నుంచి అధికారిక అనుమతి లభించింది. మూసీ రివర్‌ఫ్రంట్ ప్రాజెక్ట్‌కు కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. బాపూఘాట్‌ను 'గాంధీ సరోవర్'గా అభివృద్ధి చేయడానికి వర్కింగ్ పర్మిషన్‌ను మంజూరు చేసింది. రూ.533.42 కోట్ల విలువైన 83.81 ఎకరాల డిఫెన్స్ భూమి వినియోగానికి అనుమతిచ్చింది. ఆర్టిలరీ సెంటర్ గోల్కొండ పరిధిలోని భూమిలో అభివృద్ధి పనులకు కేంద్రం క్లియరెన్స్ ఇచ్చింది.
-మిగతా 2 లో






### ఎన్నికల హామీలను
# విస్మరించిన కాంగ్రెస్

- మాఫియా నాయకుడిగా రేవంత్ వ్యవహార శైలి
- కేసీఆర్‌ను తిట్టడమే పనిగా పాలన సాగిస్తున్నారు
- మల్కాజిగిరి కార్యకర్తల సమావేశంలో కెటిఆర్ విమర్శలు

**హైదరాబాద్,**
:రేవంత్ రెడ్డి అబద్ధాలు చెప్పి, మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని కేటీఆర్ ధ్వజమెత్తారు. మల్కాజ్‌గిరి నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఈ కొద్ది రోజుల్లోనే ప్రజలు పడుతున్న ఇబ్బందులను ప్రస్తావిస్తూ, ప్రభుత్వాన్ని ఒక మాఫియాతో పోల్చారు. ప్రభుత్వం ఏర్పడి ఇన్ని రోజులవుతున్నా ఇచ్చిన గ్యారంటీల ఊసే లేదు. దీనిపై ముఖ్యమంత్రిని ప్రశ్నిస్తే అడ్డమైన తిట్లు తిడుతున్నారు. వంద రోజుల్లో పిల్లలు పుడతారా అంటూ వింత మాటలు మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. కేసీఆర్‌ను తిట్టుకుంటూ -మిగతా 2 లో

# నిందితుల్ని వదిలిపెట్టం..



2 లో

### నేడు అన్నదాత సుఖీభవ

# నిధుల విడుదల

మొదటి తరువాయి

అన్నదాతల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేయనుంది. అన్నదాత సుఖీభవ – పీఎం కిసాన్ ద్వారా ఈ ఏడాది తొలి విడతగా రూ.3,125 కోట్లు పంపిణీ చేయనున్నారు. ఈ నగదు ద్వారా 46.85 లక్షల మంది రైతు కుటుంబాలకు లబ్ది చేకూరనుంది. మరో వైపు శనివారం ప్రధాన మంత్రి కిసాన్ యోజన పథకం కింద నిధులను విడుదల చేస్తోంది. పశ్చిమ బెంగాల్ హుగ్లీ జిల్లాలోని తారకేశ్వర్‌లో జరిగే కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ ఈ నిధులను విడుదల చేయనున్నారు. దీంతో ఒక్కో రైతు ఖాతాలో రూ. 2 వేలు చొప్పున నగదు జమ కానుంది. దీంతో కేంద్రం, ఏపీ ప్రభుత్వం ఒకే రోజు రైతుల ఖాతాల్లో నగదు జమ చేయనున్నాయి. ఇంకో వైపు జూన్ 30వ తేదీన రాష్ట్రంలోని రైతులకు రైతు భరోసా నిధులు విడుదల చేయాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిర్ణయించింది. ఆ రోజు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మధిరలో నిర్వహించే సభలో సీఎం రేవంత్ రెడ్డి ఈ నిధులను విడుదల చేయనున్నారు.

### హైదరాబాద్‌లో జనసేన నూతన

# కార్యాలయం ప్రారంభం

మొదటి తరువాయి

రాష్ట్రంలో పార్టీ విస్తరణ, సంస్థాగత బలోపేతమే లక్ష్యంగా సరికొత్త వ్యూహాలతో దూకుడు పెంచింది. హైదరాబాద్‌లో ఇప్పటికే జనసేన పార్టీకి కార్యాలయం ఉన్నప్పటికీ.. తెలంగాణలో పార్టీ ఉనికిని మరింత బలంగా చాటేందుకు ఈ కొత్త ఆఫీస్‌ను అందుబాటులోకి తెచ్చారు. రాష్ట్రంలో పార్టీ చేరికలను ప్రోత్సహించేందుకు వీలుగా త్వరలోనే ఒక ప్రత్యేక 'జాయినింగ్స్ కమిటీ'ని కూడా ఏర్పాటు చేయనున్నారు. ఈ కార్యాలయం కేంద్రంగానే తెలంగాణలో సంస్థాగత నిర్మాణం, కమిటీల ఏర్పాటు, ఇతర రాజకీయ వ్యూహాలపై జనసేన నాయకత్వం దృష్టి సారించనుంది.ఇటీవలి కాలంలో పవన్ కళ్యాణ్ హైదరాబాద్‌లో ప్రెస్‌మీట్ పెట్టడం, ఢిల్లీ వేదికగా జరిగిన 'సేన ప్రస్థానం' కార్యక్రమంలో తెలంగాణ రాజకీయాల గురించి ప్రస్తావించడం, అలాగే హనుమకొండలో తన అభిమాని నిరంజన్‌ను కలవడం వంటి వరుస పరిణామాలు జనసైనికుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపాయి. ఆంధ్రప్రదేశ్‌లో సాధించిన విజయ ఉత్సాహంతో తెలంగాణలోనూ జనసేనను ఒక బలమైన ప్రత్యామ్నాయ శక్తిగా నిలబెట్టాలని పవన్ భావిస్తున్నారు. ఈ నూతన కార్యాలయం ప్రారంభోత్సవంతో తెలంగాణ రాజకీయాల్లో జనసేన తన తదుపరి పొలిటికల్ రోడ్ మ్యాప్‌ను ఎలా సిద్ధం చేసుకోబోతోందనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# పాఠశాలల్లోనే దేశ భవిష్యత్

మొదటి తరువాయి

అందుకోసం విద్యాశాఖను తానే స్వయంగా నిర్వహిస్తున్నానని చెప్పారు. నగరంలోని ఎల్బీ స్టేడియంలో యంగ్ ఇండియా ఎడ్యుకేషన్ కిట్ల పంపిణీని గవర్నర్ శివప్రతాప్ శుక్లాతో కలిసి సీఎం ప్రారంభించారు. గురుకుల పాఠశాల విద్యార్థులకు 22 వస్తువులతో కిట్లు అందించారు. వసతి గృహ విద్యార్థులకు 10, పాఠశాల విద్యార్థులకు 7 వస్తువులతో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో రేవంత్‌రెడ్డి మాట్లాడారు. తెలంగాణ భాషా ప్రయుక్తరాష్ట్రంగానో, పాలనా సౌలభ్యం కోసమో ఏర్పడింది కాదని ఈసందర్భంగా అన్నారు. 60 ఏళ్ల సుదీర్ఘ పోరాటం, విద్యార్థుల ఆత్మబలిదానాలతో ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైంది. తెలంగాణ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు, ఉపాధి కోసం ఎంతోమంది త్యాగాలు చేశారు. దేశ భవిష్యత్తు తరగతి గదుల్లో ఉంది.. వాటిని పునరుద్ధరించాలన్నదే తన సంకల్పమని అన్నారు. విద్యాశాఖను గతంలో విధ్వంసం చేశారు. గత పాలకుల అరాచకంతో రాష్ట్రానికి వందేళ్ల నష్టం జరిగింది. తెలంగాణ ఎడ్యుకేషన్ పాలసీ రూపొందించి ప్రక్షాళన చేపట్టాం అని వివరించారు. విధ్వంసమైన విద్యాశాఖను వికాసం వైపు నడిపించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనికోసం బడ్జెట్‌లో 8.5 శాతం నిధులు కేటాయించాం. వెనుకబడిన తరగతుల విద్యార్థుల కోసం రూ.26,600 కోట్లు ఖర్చు చేస్తున్నాం. వీటిని భావితరాల భవిష్యత్తును నిర్ణయించే పెట్టుబడులుగా భావిస్తున్నాం. ఆరుట్లలోని తెలంగాణ పబ్లిక్ స్కూల్‌లో నో అడ్మిషన్ బోర్డు పెట్టారు. ప్రభుత్వ స్కూళ్లలో ఇలా బోర్డు పెట్టే పరిస్థితి వస్తుందని ఎవరూ ఊహించి ఉండరని అన్నారు. ఉద్యోగులకు జీతాల మాదిరిగానే ప్రతినెలా ఒకటో తేదీన విద్యార్థులకు కాస్మోటిక్ ఛార్జీలు చెల్లిస్తున్నామని రేవంత్‌రెడ్డి అన్నారు. గతంలో హాస్టల్ విద్యార్థులకు ఈ ఛార్జీలు పెంచలేదని, తాము అధికారంలోకి వచ్చాక పెంచామని అన్నారు. ఈ కార్యక్రమంలో గవర్నర్‌తో పాటు మంత్రులు, ఎంపిలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

# అమెరికా–ఇరాన్..చర్చలకు బ్రేక్!

మొదటి తరువాయి

ఒప్పందాన్ని విమర్శించిన ఇజ్రాయెల్ అధికారులపై జేడీ వాన్స్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయడంతో, ఇరు మిత్రదేశాల (అమెరికా, ఇజ్రాయెల్) మధ్య విభేదాలు మరింత ముదిరాయి.

లెబనాన్ వ్యాప్తంగా భీకర దాడులు..

మరోవైపు, పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరింత తీవ్రరూపం దాల్చాయి. దక్షిణ లెబనాన్ వ్యాప్తంగా తమ దళాలు రాత్రికి రాత్రే భీకర వైమానిక దాడులు జరిపినట్లు ఇజ్రాయెల్ సైన్యం శుక్రవారం (జూన్ 19, 2026) ప్రకటించింది. ఈ ప్రాంతంలో హిజ్బుల్లా దళాలతో తీవ్ర స్థాయిలో పోరాటం జరుగుతున్నట్లు సమాచారం. ఇజ్రాయెల్ జరిపిన ఈ వైమానిక దాడుల్లో కనీసం 16 మంది మరణించినట్లు లెబనాన్ ప్రభుత్వ అధికారిక వార్తా సంస్థ 'నేషనల్ న్యూస్ ఏజెన్సీ' వెల్లడించింది.

ఇరాన్ పై సముద్ర దిగ్బంధాన్ని ఎత్తివేసిన అమెరికా

ఈ ఉద్రిక్తతల నడుమే అమెరికా ఒక కీలక నిర్ణయం తీసుకుంది. ఇరాన్ రేవులు, తీర ప్రాంతాల గుండా రాకపోకలు సాగించే సముద్ర ట్రాఫిక్ పై విధించిన దిగ్బంధాన్ని ఎత్తివేసినట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ సామాజిక మాధ్యమం ఎక్స్ ద్వారా స్పష్టం చేసింది. ఇదిలా ఉంటే, అమెరికా అంతర్గత రాజకీయాల్లో రక్షణ శాఖపై ఒత్తిడి పెరుగుతోంది. అమెరికా–ఇజ్రాయెల్ యుద్ధం ప్రారంభంలో ఇరాన్ లోని ఒక ఎలిమెంటరీ పాఠశాలపై జరిగిన ప్రాంతక దాడికి సంబంధించిన దర్యాప్తు నివేదికతో సహా, పెంటగాన్ పార్లమెంటుకు సమర్పించాల్సిన పలు కీలక నివేదికలను ఇంకా అందజేయలేదు. ఈ ఆలస్యంపై ఆగ్రహం వ్యక్తం చేసిన అమెరికా సెనేటర్లు.. రక్షణ మంత్రి పీట్ హెగ్ సెత్ ప్రయాణ నిధులను నిలిపివేయాలని డిమాండ్ చేస్తున్నారు. పెంటగాన్ ఆ నివేదికలను సమర్పించే వరకు ఈ నిధులను బ్లాక్ చేయాలని సెనేటర్లు ప్రయత్నిస్తున్నారు.

# మూసీ రివర్‌ఫ్రంట్‌కు కేంద్రం గ్రీన్ సిగ్నల్

మొదటి తరువాయి

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్లాగ్‌షిప్ ప్రాజెక్ట్‌కు కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ నుండి కీలక అనుమతులు లభించాయి. హైదరాబాద్‌లోని బాపు ఘాట్ వద్ద నిర్మించతలపెట్టిన గాంధీ సరోవర్ ప్రాజెక్ట్ పనులకు రక్షణ శాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ కీలకమైన క్లియరెన్స్ లభించడం పట్ల తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ప్రాజెక్టుకు పూర్తి స్థాయిలో సహకరించి, అనుమతులు మంజూరు చేసినందుకు కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, కేంద్ర రక్షణ శాఖ , ఇండియన్ ఆర్మీకి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. తమ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న మూసీ నది పునరుజ్జీవనం , రివర్‌ఫ్రంట్ అభివృద్ధి విజన్‌లో గాంధీ సరోవర్ ప్రాజెక్ట్‌కు అనుమతులు రావడం ఒక కీలక మైలురాయి అని అభివర్ణించారు. బాపు ఘాట్ పరిసర ప్రాంతాలలో ఈ ప్రాజెక్ట్ పనులు ప్రారంభం కావడం వల్ల మూసీ పరివాహక ప్రాంత రూపురేఖలు మారిపోతాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. మూసీ నది పరివాహక ప్రాంతాన్ని కేవలం ఒక నదిలా కాకుండా.. అద్భుతమైన పర్యావరణ, సాంస్కృతిక , గొప్ప ప్రజా ఆస్తిగా మార్చడమే తెలంగాణ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని సీఎం రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా హైదరాబాద్ నగరానికి ఒక సరికొత్త పర్యాటక హంగులు తోడవుతాయని, పర్యావరణ రక్షణకు కూడా ఇది ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు. కేంద్ర రక్షణ శాఖ ఇచ్చిన ఈ గ్రీన్ సిగ్నల్‌తో గాంధీ సరోవర్ ప్రాజెక్ట్ పనులు మరింత వేగంగా ముందుకు సాగనున్నాయి.మూసీ పునరుజ్జీవం, రివర్ ఫ్రంట్ అభివృద్ధి విజన్‌లో ఇదో మైలురాయన్నారు. మూసీ పరివాహక ప్రాంతాన్ని పర్యావరణ, సాంస్కృతిక, ప్రజా ఆస్తిగా మార్చడమే లక్ష్యమని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# నీట్ రీ ఎగ్జామ్ యథాతథం

మొదటి తరువాయి

అయితే, పరీక్షకు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తయినందున, ఈ దశలో పరీక్ష ప్రక్రియలో జోక్యం చేసుకోలేమని కోర్టు పేర్కొంది. నీట్ పరీక్షకు సంబంధించిన అన్ని పిటిషన్లు ఇప్పటికే జస్టిస్ పి.ఎస్.నరసింహ నేతృత్వంలోని బెంచ్ ముందు లిస్ట్ అయి ఉన్నాయి, కాబట్టి ఈ కొత్త పిటిషన్లను కూడా ఆ బెంచే పరిశీలిస్తుందని భారత ప్రధాన న్యాయమూర్తి స్పష్టం చేశారు. ఈ వివాదానికి సంబంధించిన అన్ని పిటిషన్లను ఇప్పటికే నిర్ణయించిన తదుపరి విచారణ తేదీల్లోనే క్షుణ్ణంగా పరిశీలిస్తామని, అంతకంటే ముందే అత్యవసర విచారణ చేపట్టే ప్రసక్తే లేదని ధర్మాసనం తెలిపింది. పరీక్షకు ముందు ఇలాంటి పిటిషన్లపై విచారణ జరపడం వల్ల విద్యార్థుల్లో మరింత గందరగోళం, ఆందోళన నెలకొనే అవకాశం ఉందని న్యాయస్థానం అభిప్రాయపడింది. ధర్మాసనం తాజా నిర్ణయంతో జూన్ 21న జరగబోయే నీట్ యూజీ ఎగ్జామ్ ఎలాంటి ఆటంకాలు లేకుండా షెడ్యూల్ ప్రకారమే జరగనుంది.

టెలిగ్రామ్ నిషేధం సబబే.. ఢిల్లీ హైకోర్టు

నీట్ పరీక్ష నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం టెలిగ్రామ్ పై తాత్కాలిక నిషేధం విధించడాన్ని ఢిల్లీ హైకోర్టు సమర్థించింది. కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ టెలిగ్రామ్ దాఖలు చేసిన పిటిషన్ ను కొట్టివేసింది.



కేంద్ర ప్రభుత్వ నిర్ణయం సరైనదేనని జస్టిస్ తేజిన్ కారియా తేల్చి చెప్పారు. కేంద్రం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. అక్రమ, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడేవారికి టెలిగ్రామ్ ప్రధాన సాధనంగా మారిందని అన్నారు. అనుమానాస్పద ఛానల్స్ పై చర్యలు తీసుకోవాలని గతంలో పలుమార్లు టెలిగ్రామ్ కు సూచించామని అన్నారు. అయినప్పటికీ కంపెనీ తగిన చర్యలు తీసుకోవడంలో విఫలమైందని చెప్పారు. మరోవైపు, టెలిగ్రామ్ తరపున సీనియర్ న్యాయవాది ధ్రువ్ మెహతా వాదనలు వినిపిస్తూ ఎమర్జెన్సీ అధికారాలతో నిషేధం విధించడాన్ని కేంద్రం సమర్థించుకోలేదని అన్నారు. సంబంధిత కంటెంట్ ను మాత్రమే బ్లాక్ చేయకుండా మొత్తం యాప్ పై ఎందుకు నిషేధం విధించాల్సి వచ్చిందో వివరించలేదని పేర్కొన్నారు. కేవలం నీట్ పరీక్షతో దేశ సార్వభౌమత్వం, సమగ్రతకు ముప్పు ఏర్పడుతుందా? అని ప్రశ్నించారు. అయితే, కోర్టు కేంద్రం వాదనలను సమర్థించింది. సెక్షన్ 69ఎ కింద ఒక డిజిటల్ వేదికను నిషేధించే అధికారం ప్రభుత్వానికి ఉందని జస్టిస్ తేజిన్ కారియా స్పష్టం చేశారు. నిషేధం ఎత్తివేత కోరుతూ టెలిగ్రామ్ చేసిన అభ్యర్థనను తిరస్కరించారు.

అడ్మిట్ కార్డులు డౌన్ లోడ్ చేసుకోండి.

నీట్ అడ్మిట్ కార్డులపై ఎన్టీఏ కీలక ప్రకటన చేసింది. అడ్మిట్ కార్డులను ఇప్పటికే డౌన్ లోడ్ చేసుకున్నవారు మళ్లీ చేసుకోవాల్సిన అవసరం లేదని తెలిపింది. కొత్త అడ్మిట్ కార్డులను ఇంకా డౌన్ లోడ్ చేసుకోని విద్యార్థుల కోసం ఎన్టీఏ నుంచి ఎస్ఎంఎస్, ఈమెయిల్, వాట్సాప్ సేవలు అందుబాటులో ఉంటాయని వెల్లడించింది. మే 3 నాటి పాత అడ్మిట్ కార్డులు ఇకపై చెల్లవని స్పష్టం చేసింది. కొత్త అడ్మిట్ కార్డులను అధికారిక వెబ్ సైట్ నుంచి మాత్రమే డౌన్ లోడ్ చేసుకోవాలని సూచించింది. పలువురు విద్యార్థుల కోరిక మేరకు వారు కోరిన నగరాల్లో కొత్త పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపింది.

# భూవివాదాలు లేని తెలంగాణ నిర్మాణమే లక్ష్యం

మొదటి తరువాయి

2240 గ్రామాలను ఎంపిక చేసి రీసర్వే చేపట్టనున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. భూమి రైతుకు కేవలం ఆస్తి మాత్రమే కాదని.. అది అతని జీవనాధారమని ప్రతి అంగుళం భూమికి స్పష్టమైన హద్దులు, ప్రతి సర్వే నంబర్‌కు భూదార్, ప్రతి రైతుకు భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణను భూ వివాదాలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ఈ రీ–సర్వే కార్యక్రమం చారిత్రాత్మక మైలురాయిగా నిలుస్తుందని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు. రాష్ట్రంలో ఇప్పటికీ అనేక ప్రాంతాల్లో 1936 నాటి నిజాం కాలం సర్వే రికార్డులే ప్రధాన ఆధారంగా ఉన్నాయని, కాలక్రమేణా భూముల విభజనలు, ఉపసంఖ్యలు పెరగడం, పట్టణీకరణ విస్తరించడం, పరిపాలనా సరిహద్దులు మారడం వల్ల అనేక ప్రాంతాల్లో భూముల అసలు హద్దులపై స్పష్టత లేకుండా పోయిందన్నారు. ఈ పరిస్థితులకు శాశ్వత పరిష్కారం చూపేందుకే ప్రభుత్వం సమగ్ర రీ–సర్వే చేపడుతోందని తెలిపారు. భూ వివాదాల పరిష్కారంలో భాగంగా రాష్ట్రంలో నిజాం కాలం నుంచి నక్షాలు లేని 378 గ్రామాలను గుర్తించామని, వాటిలో ఇప్పటికే 5 గ్రామాల్లో రీ–సర్వే పూర్తి చేసి భూదార్ నంబర్లు కేటాయించినట్లు తెలిపారు. మిగిలిన 373 గ్రామాల్లో కూడా రోవర్స్ వంటి ఆధునిక సాంకేతికతతో సర్వే పనులు వేగంగా కొనసాగుతున్నాయని చెప్పారు. గొలుసులు, కర్రలు, క్రాస్ స్టాఫ్, మెజరింగ్ టేప్ వంటి పాత సర్వే పరికరాలకు పూర్తిగా స్వస్తి చెబుతున్నామని మంత్రి తెలిపారు. డీజీపీఎస్, రోవర్స్, జీఐఎస్, క్యూజీఐఎస్ వంటి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ శాస్త్రీయ పద్ధతిలో భూముల సర్వే నిర్వహించనున్నట్లు చెప్పారు. ఇప్పటికే 411 రోవర్స్ కొనుగోలు చేయగా, త్వరలో మరో 400 రోవర్స్ కొనుగోలు చేయనున్నట్లు వెల్లడించారు. భూముల రీ–సర్వే పూర్తయిన తర్వాత ప్రతి భూకమతానికి ఖచ్చితమైన హద్దులను నిర్ణయించి, ప్రతి సర్వే నంబర్‌కు ప్రత్యేక భూదార్ నంబర్ కేటాయించనున్నట్లు మంత్రి తెలిపారు. ఆధార్ తరహాలో ప్రతి భూమికి ప్రత్యేక గుర్తింపుగా భూదార్ కార్డులు జారీ చేస్తామని చెప్పారు. డీజీపీఎస్ ద్వారా సేకరించిన సమాచారాన్ని క్యూజీఐఎస్ సాఫ్ట్‌వేర్‌లో నిక్షిప్తం చేసి భూ భారతి పోర్టల్‌లో నమోదు చేయనున్నట్లు తెలిపారు.తెలంగాణ ప్రాంతంలో 1948 నాటికి సుమారు 40 లక్షల సర్వే నంబర్లు ఉండగా, ప్రస్తుతం అవి 2 కోట్ల 29 లక్షలకు పెరిగాయని రాష్ట్రంలోని అన్ని సర్వే నంబర్లకు దశలవారీగా భూదార్ నంబర్లు కేటాయించేందుకు ప్రభుత్వం సమగ్ర కార్యాచరణ రూపొందించిందన్నారు. రీ–సర్వే కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు అవసరమైన మానవ వనరులను ప్రభుత్వం సమకూర్చిందని, 5,520 మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లకు శిక్షణ ఇచ్చి లైసెన్సులు జారీ చేశామని, భూవిస్తీర్ణాన్ని బట్టి ప్రతి మండలానికి 4 నుంచి 6 మంది సర్వేయర్లను నియమించామని చెప్పారు. రాష్ట్రంలోని రెవెన్యూ గ్రామాలను క్లస్టర్లుగా విభజించి ప్రత్యేక పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. భూముల రీ–సర్వే పూర్తయిన తర్వాత ప్రతి కమతానికి ఖచ్చితమైన సరిహద్దులు, ప్రత్యేక పటాలు సిద్ధమవుతాయని, తద్వారా భూ యాజమాన్యంపై ఎలాంటి వివాదాలకు తావు ఉండదన్నారు. భూ భారతి చట్టం ద్వారా సాగు భూముల రిజిస్ట్రేషన్లకు సర్వే పటం తప్పనిసరి చేసిన నేపథ్యంలో రీ–సర్వే ద్వారా భూముల రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ ప్రక్రియలు మరింత పారదర్శకంగా, వేగవంతంగా మారనున్నాయని తెలిపారు.

# కేంద్రం నిర్ణయించిన పంటలే కొంటే ఇక మీరెందుకు?


మొదటి తరువాయి

ఆయన జన్మదినం రోజే ఆ డిక్లరేషన్‌ను తెలంగాణ సీఎం బొందపెట్టారని హరీశ్ రావు విమర్శించారు. ధాన్యం ఏదైనా కనీస మద్దతు ధరతోపాటు బోనస్ కూడా ఇస్తామని నాడు రాహుల్ గాంధీ వరంగల్ వేదికగా ప్రకటించారని గుర్తు చేశారు. కానీ అందుకు భిన్నంగా కేంద్రం చెప్పిందే కొంటాం.. ఎంత కొనమంటే అంతే కొంటామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే తెలిపారు. తన బాధ్యత నుంచి తప్పించుకుంటుందంటూ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రం కొన్నా కొనకపోయినా.. అన్ని పంటలు కొన్నది కేసీఆర్ ప్రభుత్వమని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. తన నిర్ణయం మార్చుకోవాలని ప్రభుత్వాన్ని ఎమ్మెల్యే హరీశ్ రావు డిమాండ్ చేశారు. కేంద్రం ఎంఎస్‌పి ప్రకటిస్తుంది తప్ప మక్కలూ, జొన్నలు కొనదా? అని అసహనం వ్యక్తం చేశారు. పప్పు దినుసులు, వేరుశనగ 25 శాతం మాత్రమే కేంద్రం కొనుగోలు చేస్తుందన్నారు. అంటే మిగతా పంటను రైతులు బయట అమ్ముకోవాలా? అని ప్రభుత్వాన్ని ఆయన నిలదీశారు. దళారుల దయాదక్షిణ్యంపై రైతులు ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొందని హరీశ్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. 50 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే కేంద్రం కొంటుందని.. మిగతా పంటను రైతులు ఏం చేయాలని ప్రభుత్వాన్ని నిలదీశారు. ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలంటున్న రైతులకు ప్రభుత్వం భరోసా ఇస్తుందా అని అడిగారు. తడి గుడ్డతో రైతుల గొంతును రేవంత్ రెడ్డి ప్రభుత్వం కోస్తుందన్నారు. రైతులు జీవితాలతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెలగాటం ఆడుతున్నాయన్నారు. ఎకరాకు రెండు బస్తాల యూరియా మాత్రమే.. అదీ నెలకు ఒకటి చొప్పున ఇస్తారట అంటూ ఆయన ఆందోళన చెందారు. రైతులంటే మీకు ఎందుకు ఇంత చిన్నచూపు అని మంత్రులను ఆయన ప్రశ్నించారు. యూరియా ఇచ్చే తెలివి కూడా లేదా అని ప్రభుత్వాన్ని నిలదీశారు. మిర్చి రైతులు ఎకరాకు ఐదారు యూరియా బస్తాలు వాడుతారని.. మరి మీరు రెండే ఇస్తే మిగతాది ఎట్లా అని ప్రశ్నించారు. కేంద్రం 30 శాతం యూరియా ధరలు పెంచిందని వివరించారు. రెండు బస్తాల ఆలోచన విరమించుకోవాలని ప్రభుత్వానికి ఆయన హితవు పలికారు. 45 రోజుల్లో 9 వేల కోట్ల రూపాయిల రైతు బంధు ఇస్తామన్నారని.. 90 రోజులు అయ్యిందని.. ఇప్పటికీ రైతుల ఖాతాల్లో నగదు మొత్తం పడలేదని విమర్శించారు. ఎకరాకు రూ.15 వేలు అన్నారని చెప్పారు. 2024–25 వానాకాలం పంటకు ఒక్క రూపాయి ఇవ్వలేదని.. పూర్తిగా ఎగ్గొట్టారని తెలిపారు.

# నిందితుల్ని వదిలిపెట్టం..

-రామభక్తుల మనోభావాలు దెబ్బతినేలా వ్యాఖ్యలు చేయొద్దు
- విరాళాల దుర్వినియోగంపై 'సిట్' దర్యాప్తునకు ఆదేశం
- ఆధారాలు ఉంటే దర్యాప్తు బృందానికి సమర్పించండి: సీఎం
- ఆలయ ప్రతిష్టకు భంగం కలిగించే దుష్ప్రచారాలు నమ్మకండి
-అయోధ్య రామమందిరం విరాళాల స్కాంపై యూపీ సీఎం యోగి వార్నింగ్

న్యూఢిల్లీ



ఉత్తర ప్రదేశ్, అయోధ్యలోని రామ మందిరంలో విరాళాలకు సంబంధించి అవకతవకలు జరిగినట్లు వెల్లడైన సంగతి తెలిసిందే. ఈ అంశంపై యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ స్పందించారు. నిందితులు ఎలాంటివారైనా, ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టేది లేదని సీఎం హెచ్చరించారు. యోగి ఆదిత్యనాథ్ శుక్రవారం అయోధ్యలో పర్యటించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. రామ భక్తుల మనోభావాలు దెబ్బతినేలా ప్రజలు ఎలాంటి వ్యాఖ్యలు చేయొద్దని ఆయన కోరారు.అలాగే, ఈ అంశంపై సిట్ దర్యాప్తు జరుపుతోందని, దీనికి సంబంధించి ఎవరివద్దనైనా ఆధారాలుంటే సిట్‌కు సమర్పించాలని ఆయన సూచించారు. ఆలయ ట్రస్ట్ వినతి మేరకు ఈ అంశంపై దర్యాప్తు జరిపేందుకు సిట్ ఏర్పాటు చేశామని, ఈ అంశంలోని విషయాల్ని సిట్ వెలుగులోకి తెస్తుందని భావిస్తున్నామని యోగి అన్నారు. భక్తులు కూడా ఆలయంపై జరుగుతున్న అనేక దుష్ప్రచారాలను నమ్మకుండా సహనంతో ఉండాలని, ఆలయ ప్రతిష్టకు భంగం కలిగించే ప్రయత్నాలకు దూరంగా ఉంటూ, రాముడికి సంబంధించి గౌరవం, సహనం కలిగి ఉండాలని భక్తులను కోరారు. రామాలయ ఉద్యమాన్ని కాంగ్రెస్, ఎస్పీలు అడ్డుకుంటున్నాయని, గత ప్రభుత్వాలు రామ భక్తులకు, కర సేవకులకు వ్యతిరేకంగా చర్యలు తీసుకున్నారని యోగి గుర్తు చేశారు. గతంలో అయోధ్యలో రామాలయ నిర్మాణాన్ని అడ్డుకున్న కాంగ్రెస్ పార్టీ.. ఇప్పుడు ఇక్కడి ఆలయంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు నటిస్తోందని, ఇది ఆ పార్టీ ద్వంద్వ ప్రమాణాలకు నిదర్శనం అన్నారు. రామాలయ ఉద్యమాన్ని కూడా కోర్టులో కాంగ్రెస్ పార్టీ అడ్డుకుందున్నారు. రామభక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయంటున్న సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) గతంలో కరసేవకులపై కాల్పులు జరపాలంటూ ఆదేశించిందని, జై శ్రీరామ్ అన్నవారిపై దళాల్ని ప్రయోగించిందంటూ యోగి విమర్శించారు. అయోధ్యలోని రామ మందిరానికి వచ్చిన విరాళాల విషయంలో అవకతవకలు, అక్రమాలు జరిగాయనే విషయం తాజాగా వెల్లడైంది.

# ఎన్నికల హామీలను విస్మరించిన కాంగ్రెస్

మొదటి తరువాయి



తిరిగితే చాలు, పాలన చేయనక్కర్లేదు అనే చందాన సీఎం వ్యవహార శైలి ఉందని విమర్శించారు. గత ప్రభుత్వం చేసిన పనులకు రిబ్బన్లు కట్ చేయడానికి సీఎం తన జేబులో కత్తెర పెట్టుకుని తిరుగుతున్నారని కేటీఆర్ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర అభివృద్ధి శూన్యమైందని, కేవలం అప్పులే పెరిగిపోయాయని కేటీఆర్ ఆరోపించారు. ఈ కొద్ది కాలంలోనే ప్రభుత్వం దాదాపు 4 లక్షల కోట్ల రూపాయల అప్పు చేసిందని పేర్కొన్నారు. హైదరాబాద్ నగరంలో పేదలకు ఒక్క ఇల్లు కూడా కట్టి ఇవ్వలేదు గాని, 'హైడ్రా' పేరుతో ఉన్న ఇళ్లను మాత్రం నిర్దాక్షయంగా కూల్చుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ నాయకులను 'దండుపాళ్యం ముఠా'తో పోల్చిన ఆయన, ఈ ప్రభుత్వాన్ని ఒక మాఫియా నడుపుతోందని, ఆ మాఫియాలో రేవంత్ రెడ్డి ఒక పిల్ల నాయకుడు అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

రాష్ట్రంలో రైతుల పరిస్థితి మరీ దారుణంగా తయారైందని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం కొనుగోలు చేయడానికి ప్రభుత్వం దగ్గర గోనెసంచులు కూడా లేవని, ఆ సంచులన్నీ ఢిల్లీకి పోతున్నాయని విమర్శించారు. రైతులకు ఇవ్వాల్సిన 'రైతుబంధు' డబ్బు బంద్ అయిపోయిందని, ఆ పైసలన్నీ రాహుల్ గాంధీ ఖాతాలో 'టింగ్ టింగ్' అని పడుతున్నాయని ఆరోపించారు. ప్రస్తుతం పరిస్థితి ఎంత దారుణంగా ఉందంటే, రైతులు ధాన్యం కుప్పలపైనే ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి వచ్చిందని పేర్కొన్నారు.

కాంగ్రెస్ పాలనలో ప్రజలకు మంచి, చెడు ఏంటో పూర్తిగా అర్థమైందన్న కేటీఆర్, కేసీఆర్‌ను మళ్లీ అధికారంలోకి తీసుకురావడానికి ప్రజలంతా కథానాయకులు కావాలని పిలుపునిచ్చారు. మల్కాజ్‌గిరి ప్రజలు , బిఆర్ఎస్ కార్యకర్తలు ఎటువంటి రౌడీలు, గుండాలకు భయపడాల్సిన అవసరం లేదని, పార్టీ ఎల్లప్పుడూ ప్రజల పరంగా నిలబడుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## సిల్ట్ తొలగింపు పనులను పరిశీలించిన మేయర్ కొలగాని శ్రీనివాస్



**కరీంనగర్, జూన్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ నగరపాలక సంస్థ ప్రత్యేక శానిటేషన్ కార్యక్రమంలో భాగంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ 20వ, 56వ డివిజన్లలో జరుగుతున్న సిల్ట్ తొలగింపు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని మురికికాలువల్లో పేరుకుపోయిన సిల్ట్‌ను తొలగించి నీటి నిల్వలు, దోమల వ్యాప్తి వంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నగర ప్రజలకు మెరుగైన పారిశుధ్య సేవలు అందించేందుకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు.కార్యక్రమంలో కార్పొరేటర్లు తాటి ప్రభావతి, పర్వతం మల్లేశం, మున్సిపల్ అధికారులు, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.


## పెద్దమ్మ గుడి బోనాల ఉత్సవాలకు పూర్తి సహకారం ఉంటుంది

- డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు



**కరీంనగర్, జూన్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
గత 50 సంవత్సరాలుగా ఆరుద్ర చివరి పాదంలో వైభవంగా నిర్వహిస్తున్న పెద్దమ్మతల్లి బోనాల జాతర ఈ సంవత్సరం జూలై 5న ఘనంగా జరగనుంది. ఈ సందర్భంగా పట్టణ ముదిరాజ్ సంఘం నాయకులు డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావుకు వినతిపత్రం అందజేశారు. విజ్ఞప్తిపై ఆయన స్పందిస్తూ బోనాల పండుగను ఎలాంటి ఆటంకాలు లేకుండా నిర్వహించేందుకు నగరపాలక సంస్థ పూర్తి సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా త్రాగునీటి సదుపాయం, టెంట్లు, ప్రత్యేక విద్యుత్ దీపాలు, పరిశుభ్రత చర్యలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ ముదిరాజ్ సంఘం అధ్యక్షులు కొలకాని నర్సయ్య ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి పండుగ నాగరాజు ముదిరాజ్, సభ్యులు కుంభం రాజయ్య, ఏంద్ర శ్రీనివాస్, జెట్టి బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

## పాన్ షాపులపై పోలీసుల ఆకస్మిక తనిఖీలు




**కరీంనగర్, జూన్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మాదకద్రవ్యాలు, నిషేధిత పొగాకు ఉత్పత్తుల విక్రయాలను అరికట్టేందుకు కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. విద్యాసంస్థల పరిసరాల్లోని పాన్ షాపులను లక్ష్యంగా చేసుకుని ఏకకాలంలో మెరుపు దాడులు చేపట్టారు.మొత్తం 99 పాన్ షాపులను పరిశీలించగా, నిషేధిత వస్తువులు విక్రయిస్తున్న వారిపై 52 కేసులు నమోదు చేశారు. వన్‌టౌన్‌లో 11, టూ టౌన్‌లో 13, త్రీ టౌన్‌లో 8, కొత్తపల్లి లో 3, హుజూరాబాద్‌లో 8, కేశవపట్నం లో 1, జమ్మికుంటలో 4, వీణవంకలో 1, ఇల్లందకుంటలో 3 కేసులు నమోదయ్యాయి.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం, ఐపీఎస్ మాట్లాడుతూ యువతను మాదకద్రవ్యాలు, హానికరమైన పొగాకు ఉత్పత్తుల బారిన పడకుండా కాపాడేందుకు నిరంతరం ప్రత్యేక చర్యలు కొనసాగిస్తున్నామని తెలిపారు. విద్యాసంస్థల పరిసరాల్లో నిషేధిత వస్తువుల విక్రయాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని హెచ్చరించారు. ప్రజలు సమాచారం ఉంటే వెంటనే డయల్ 100 ద్వారా పోలీసులకు తెలియజేయాలని కోరారు.

## 19వ డివిజన్‌లో మంచినీటి పైప్‌లైన్ పనులు ప్రారంభం




**కరీంనగర్, జూన్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ నగరంలోని 19వ డివిజన్ హనుమాన్ నగర్‌లో మంచినీటి పైప్‌లైన్ విస్తరణ పనులను కార్పొరేటర్ సుధగోని మాధవి, కృష్ణ గౌడ్ ప్రారంభించారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ అమృత్ పథకం కింద నిర్మిస్తున్న వాటర్ ట్యాంక్ పనులు పూర్తయ్యేలోపు డివిజన్‌లోని ప్రతి కాలనీలో పైప్‌లైన్ పనులను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. త్వరలోనే ప్రజలకు మంచినీటి కొరత లేకుండా చూడనున్నామని, పనులు వేగంగా సాగడానికి స్థానికులు సహకరించాలని కోరారు.కార్యక్రమంలో స్థానిక నాయకులు మజీద్, సాదిక్, గౌసిలతో పాటు మున్సిపల్ వాటర్ సప్లై సిబ్బంది, కాలనీవాసులు పాల్గొన్నారు.

## జిల్లా పరిషత్ భవనం యొక్క పార్కు ఆధునీకరణకు చర్యలు



**కరీంనగర్, జూన్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ జిల్లా పరిషత్ భవనంలోని నగరపాలక సంస్థ పార్కును త్వరలోనే ఆధునీకరించనున్నట్లు డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు తెలిపారు.పార్కును సందర్శించిన ఆయన మున్సిపల్ అధికారులతో మాట్లాడుతూ పాడైపోయిన ఫౌంటెన్, బాత్‌రూమ్‌లు, వాకింగ్ ట్రాక్‌ను వెంటనే పునరుద్ధరించాలని ఆదేశించారు. పచ్చదనం పెంపొందించి, రాత్రి వేళల్లో తగినంత లైటింగ్‌తో పాటు మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతిరోజూ 400--500 మంది ప్రజలు పార్కును వినియోగిస్తున్నారని, వారి సౌకర్యార్థం రాబోయే రెండు మూడు నెలల్లో పార్కును పూర్తిగా ఆధునీకరించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని ఆయన హామీ ఇచ్చారు. సుమారు పది సంవత్సరాల క్రితం రూ.52 లక్షల వ్యయంతో నిర్మించిన ఈ పార్కును తిరిగి ఆధునీకరించి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు.

## ఎస్సీ స్టడీ సర్కిల్‌ను సందర్శించిన కలెక్టర్ చిత్రా మిశ్రా



**కరీంనగర్, జూన్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జిల్లా కేంద్రంలోని ఎస్సీ స్టడీ సర్కిల్‌ను కలెక్టర్ చిత్రా మిశ్రా శుక్రవారం సందర్శించారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆమె అధికారులను ఆదేశించారు.భవనంలో అవసరమైన మరమ్మత్తులు వారంలోగా పూర్తి చేయాలని, రీడింగ్ రూమ్, తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ సదుపాయాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. స్టోర్‌రూమ్ ఖాళీ చేసి, ఆన్‌లైన్ పరీక్షల కోసం కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ ఇంచార్జి తిరుపతి రావు, స్టడీ సర్కిల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

## ప్రాథమిక పాఠశాలలో పుస్తకాల పంపిణీ



**ఖానాపూర్, జూన్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఖానాపూర్ మండలంలోని మారుమూల ప్రాంతం కొలంగూడ ప్రాథమిక పాఠశాలలో ప్రభుత్వం సరఫరా చేసిన ఉచిత నోటుబుక్కులు, పాఠ్యపుస్తకాలను గ్రామ సర్పంచ్ ఆత్రం అర్జున్ విద్యార్థులకు అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్, ఉపాధ్యాయులు విద్యార్థులు, గ్రామస్తులకు ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న వసతులు, ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తిరుమలేష్, అమ్మ పాఠశాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుండి ఆన్లైన్లో యూరియా బుకింగ్ ప్రారంభం




**పాలకుర్తి, జూన్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పాలకుర్తి మండలంలో యూరియా బుకింగ్ యాప్‌ను పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష జూన్ 20న లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని వ్యవసాయ శాఖ అధికారి బండి ప్రమోద్ తెలిపారు.వానాకాలం సీజన్ కోసం ఇప్పటికే 67.5 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు అందుబాటులో ఉంచినట్లు ఆయన పేర్కొన్నారు. రైతులు అవసరమైన మేరకు మాత్రమే యాప్ ద్వారా బుక్ చేసుకోవాలని, ఒకేసారి ముందస్తు కొనుగోళ్లకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. యాప్ ద్వారా బుక్ చేసిన యూరియా బస్తాలను సంబంధిత రైతు మాత్రమే పొందగలరని, తిరిగి అవసరమైతే 15 రోజుల అనంతరం మళ్లీ పొందవచ్చని తెలిపారు. ప్రతి రైతుకు సమానంగా యూరియా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు.

## ప్రైవేటు స్కూల్ బస్సుల అడ్డగింత



**పాలకుర్తి, జూన్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
: పాలకుర్తి మండలం కొత్తపల్లి గ్రామ శివారులో గ్రామ పాలకవర్గం, గ్రామస్థులు కలిసి ప్రైవేటు విద్యాసంస్థల బస్సులను గ్రామంలోకి రాకుండా అడ్డుకున్నారు. ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకునే ఉద్యమ స్ఫూర్తిగా ఈ చర్య చేపట్టారు.సర్పంచ్ తోట స్వప్న మహేష్ మాట్లాడుతూ ప్రభుత్వ బడిలో విద్యార్థుల సంఖ్య తగ్గిపోవడంతో పూర్వ వైభవం తేవడానికి ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ప్రభుత్వం అన్ని సౌకర్యాలతో నాణ్యమైన ఉచిత విద్యను అందిస్తోందని, ప్రైవేటు పాఠశాలలు అధిక ఫీజులు వసూలు చేసి తల్లిదండ్రులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని పేర్కొన్నారు. ఇకపై గ్రామంలోకి ప్రైవేటు స్కూల్ బస్సులు రాకుండా నిషేధిస్తున్నట్టు పాలకవర్గం స్పష్టం చేసింది.

## విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీ




**పాలకుర్తి, జూన్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
పాలకుర్తి మండలం జయ్యారం గ్రామ ఉన్నత పాఠశాలలో సర్పంచ్ కాసర్ల కిరణ్ ప్రభుత్వం అందించే ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్‌ను విద్యార్థులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సర్కారు బడులలో విద్యార్థుల కోసం వేల కోట్ల రూపాయలు వెచ్చించి పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫాం, మధ్యాహ్న భోజనం వంటి సౌకర్యాలు కల్పిస్తోందని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ఇప్పటి వరకు 20 మంది విద్యార్థులు కొత్తగా అడ్మిషన్ తీసుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ వర్షిణి సంతోష్, ప్రధానోపాధ్యాయులు జయరాం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ట్రాన్స్‌ఫార్మర్ రిపేర్ కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే వంశీకృష్ణ



**అమ్రాబాద్, జూన్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
అమ్రాబాద్ మండల కేంద్రంలో ట్రాన్స్‌ఫార్మర్ రిపేర్ కేంద్రానికి శుక్రవారం భూమిపూజ జరిగింది. అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ, ఉమ్మడి అమ్రాబాద్ మండల రైతులు తక్కువ వోల్టేజ్, ట్రాన్స్‌ఫార్మర్లు తరచూ కాలిపోవడం వంటి సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. రిపేర్ కోసం దూర ప్రాంతాలకు పంపాల్సి రావడంతో పంటలు నష్టపోతున్నాయి. ఈ సమస్యకు పరిష్కారంగా స్థానికంగా రిపేర్ కేంద్రం ఏర్పాటు చేస్తున్నాం” అని తెలిపారు.ఎల్మపల్లి గేటు సమీపంలోని 20 గుంటల ప్రభుత్వ భూమిని ఈ కేంద్రం కోసం కేటాయించినట్లు వెల్లడించారు. పనులను వేగంగా పూర్తి చేసి రైతులకు అందుబాటులోకి తేవాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, సర్పంచులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

## శాతవాహనలో బిజినెస్ రీసెర్చ్ మెథడాలజీ పుస్తకావిష్కరణ




**కరీంనగర్, జూన్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
శాతవాహన విశ్వవిద్యాలయం వాణిజ్యశాఖ ఆధ్వర్యంలో రూపొందించిన బిజినెస్ రీసెర్చ్ మెథడాలజీ పుస్తకాన్ని ఉపకులపతి ఆచార్య ఉమేష్ కుమార్ పరిపాలన భవనంలో ఆవిష్కరించారు. పుస్తకాన్ని వాణిజ్యశాఖాధిపతి డా. డి. హరికాంత్ ప్రధాన రచయితగా, పరిశోధక విద్యార్థి అనిల్ బోనాల సహ రచయితగా రూపొందించారు. ఈ సందర్భంగా ఉపకులపతి ఉమేష్ కుమార్ మాట్లాడుతూ పరిశోధన పద్ధతులపై విద్యార్థులు, అధ్యాపకులకు ఉపయోగపడే విధంగా పుస్తకం రూపొందించడం అభినందనీయమని అన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య పి. సతీష్ కుమార్ మాట్లాడుతూ వాణిజ్యశాఖ ఆధ్వర్యంలో అకాడమిక్ ప్రచురణలు రావడం విశ్వవిద్యాలయానికి గర్వకారణమని పేర్కొన్నారు. రచయితలు భవిష్యత్తులో మరిన్ని పరిశోధనాత్మక గ్రంథాలు వెలువరించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డా. కె. తిరుపతి, డా. బి. నరేష్, డా. బి. పరశురాములు, డా. మనోజ్ కుమార్ కిషన్ తదితరులు పాల్గొని రచయితలను అభినందించారు.

## గ్రామాల్లో పశు వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి

- కలెక్టర్ చిత్రా మిశ్రా



**కరీంనగర్, జూన్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా శుక్రవారం జిల్లా ప్రధాన పశువైద్యశాలను సందర్శించారు. పశువులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు గ్రామాల్లో విరివిగా పశు వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని ఆమె అధికారులను ఆదేశించారు. ఆసుపత్రిలో వాక్సినేషన్, మందుల వివరాలు, ల్యాబరేటరీ, శస్త్ర చికిత్స గదులు, ఎక్స్‌రే గది, మందుల గది పరిశీలించారు. శిథిలావస్థలో ఉన్న పాత భవనాన్ని తొలగించి, ఫౌంటెన్, పార్కింగ్ స్థలం, జంతువుల శవపరీక్ష సదుపాయం ఏర్పాటు చేయాలని ఆర్ అండ్ బీ అధికారులను ఆదేశించారు. జంతువుల ఆపరేషన్ కోసం పక్కనున్న భవనాన్ని వినియోగించాలని సూచిస్తూ, అందుబాటులో ఉన్న పరికరాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి లింగారెడ్డి, అసిస్టెంట్ డైరెక్టర్లు నరేష్ కుమార్, వినోద్ కుమార్ పాల్గొన్నారు.

## పద్మశాలి ఉద్యోగుల రాష్ట్ర సదస్సు విజయవంతం చేయాలని పిలుపు

**ఖానాపూర్, జూన్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఈ నెల 26న హైదరాబాద్ ఎల్బీనగర్ స్వకులశాలి సమాజ భవనంలో జరగనున్న పద్మశాలి ఉద్యోగుల రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని నిర్మల్ జిల్లా అధ్యక్షులు బూర ఉమా శంకర్ పిలుపునిచ్చారు. సదస్సులో పద్మశాలి ఉద్యోగుల సంఘం చేపడుతున్న కార్యక్రమాలపై చర్చ జరగనుందని, అందువల్ల నిర్మల్ జిల్లా పద్మశాలి ఉద్యోగులందరూ హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## భారత రిలే జట్టుకు ఎంపికైన ప్రవళిక

ఆర్థిక సహాయం అందజేసిన ఎమ్మెల్యే బాలు నాయక్



**దేవరకొండ, జూన్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
డిండి మండల యువ అథ్లెట్ నారిమళ్ళ ప్రవళిక ఆసియా అండర్-23 అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో భారత రిలే జట్టుకు ఎంపికైంది. ఆమె ప్రతిభను గుర్తించి ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ స్వంత నిధుల నుండి రూ.1 లక్షల ఆర్థిక సహాయం అందజేశారు. ప్రవళిక సాధారణ కుటుంబానికి చెందినప్పటికీ కష్టపడి సాధన చేసి జాతీయ స్థాయికి చేరుకోవడం యువతకు ఆదర్శమని ఎమ్మెల్యే అభినందించారు. ప్రవళిక భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి తెలంగాణకు పేరు తీసుకురావాలని ఆకాంక్షిస్తూ ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

## దేశ సరిహద్దులో పనిచేస్తున్న సైనికుడికి ఇచ్చే జీతం సాఫయి కార్మికులకు కూడా ఇవ్వాలని సీఐటీయూ డిమాండ్

**కరీంనగర్, జూన్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
సీఐటీయూ అనుబంధ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కరీంనగర్‌లో శుక్రవారం సుమారు 250 మంది మున్సిపల్ కార్మికులు దీక్షల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఎడ్ల రమేష్ మాట్లాడుతూ దేశ సరిహద్దులో పనిచేస్తున్న సైనికుడికి ఇచ్చే జీతం, సౌకర్యాలు సమాజ పరిశుభ్రత కోసం కష్టపడుతున్న సాఫయి కార్మికులకు కూడా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల వాగ్దానాలను తక్షణమే అమలు చేయాలని కోరారు. ఔట్సోర్సింగ్, ఎన్.ఎం.ఆర్ ఫిక్స్ పే కార్మికులను పర్మనెంట్ చేయాలని, రెండో పిఆర్సి



ప్రకటించి కనీస వేతనం రూ.26 వేలుగా నిర్ణయించాలని, ఇందిరమ్మ ఇల్లు, ఇండ్ల స్థలాలు మున్సిపల్ కార్మికులకు ప్రాధాన్యతగా ఇవ్వాలని, ఒక్కపూట 8 గంటల పని విధానం అమలు చేయాలని ఆయన స్పష్టం చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్త నిరవధిక సమ్మె చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నగర కన్వీనర్ పుల్లెల్ల మల్లయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జనగాం రాజమల్లు, మహిళా కన్వీనర్ ముక్కెర బుజ్జమ్మ, జిల్లా అధ్యక్షులు కవ్వంపల్లి రవి, వర్కింగ్ ప్రెసిడెంట్ కాంపల్లి పోచయ్య, మానుపాటి మల్లేశం, దేవునూరి శ్యాంసుందర్, దాసరి రాజమల్లయ్య, బందిలి తిరుపతి, బడిగల చంద్రయ్య, బి. వెంకటస్వామి, కొంకంటి పద్మ, పురత్తం రాధ మొండయ్య తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు ఎరువులు, విత్తనాలు సకాలంలో అందించాలని బీఆర్ఎస్ డిమాండ్



**హుస్నాబాద్, జూన్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
రైతులకు సరిపడా ఎరువులు, నాణ్యమైన విత్తనాలు అందించి వ్యవసాయ పనులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం హుస్నాబాద్ వ్యవసాయ శాఖ ఏడీఏ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ రాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అయిలేని మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ గతంలో రైతులు ఎరువుల కోసం రోజులు తరబడి తిరిగిన పరిస్థితులు ఉన్నాయని, ప్రస్తుతం యాప్ విధానం రైతులను అయోమయానికి గురిచేస్తోందని పేర్కొన్నారు. యాప్‌ను రద్దు చేసి పాత విధానంలోనే ఎరువుల పంపిణీ చేపట్టాలని కోరారు. ఖరీఫ్ సీజన్ దృష్ట్యా రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలని, నకిలీ విత్తనాలు, రసాయనాలు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే రైతులు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించకుండా బ్యాంకుల ద్వారా సకాలంలో పంట రుణాలు అందేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు చిత్తారి శ్రీనివాస్, అయిలేని గాల్ రెడ్డి, భూక్యా రాజు నాయక్, మంద జానకిరాం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 20,000 పోస్టులతో భారీ నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్



**కరీంనగర్, జూన్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
శాతవాహన యూనివర్సిటీ విద్యార్థులు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ప్రభుత్వాన్ని తక్షణమే స్పందించాలని కోరారు. విద్యార్థులు 20,000 పోస్టులతో భారీ నోటిఫికేషన్ విడుదల చేయాలని, పీసీ, ఎస్సై, ఎఫ్‌బిఓ పోస్టులను పెంచి నియామక ప్రక్రియను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా, ప్రభుత్వం ఇచ్చిన 2 లక్షల ఉద్యోగాల హామీని నెరవేర్చాలని, నిరుద్యోగులకు నష్టం కలిగిస్తున్న జి.ఓ. 46ను రద్దు చేయాలని, నిరసనల్లో పాల్గొన్న వారిపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని కోరారు. యువత భవిష్యత్తుతో ముడిపడి ఉన్న ఈ అంశాలపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని, లేదంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని విద్యార్థులు హెచ్చరించారు. మా హక్కులు -- మా పోరాటం నినాదంతో ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.

## మేడిపల్లి నూతన సీఐగా జలంధర్ రెడ్డి





**మేడ్చల్ మల్కాజిగిరి , జూన్ 19 ( నీలగిరి ఎక్స్ ప్రెస్):**
మల్కాజ్గిరి కమిషనరేట్ పరిధిలో మేడిపల్లి పోలీస్ స్టేషన్ కు. నూతన సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా జలంధర్ రెడ్డి శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ ఇప్పటి వరకు విధులు నిర్వహించిన చింత శంకరయ్య హిమాయత్ నగర్ పీఎస్‌కు బదిలీపై వెళ్ళారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా జలంధర్ రెడ్డి బాధ్యతలు చేపట్టిన అనంతరం మాట్లాడుతూ.. .. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. నేరాల నియంత్రణ, ప్రజా సమస్యల పరిష్కారం, ట్రాఫిక్ నిర్వహణలో ప్రత్యేక దృష్టి సారిస్తామని సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా జలంధర్ రెడ్డి తెలిపారు.

## ఏసీపీ విజయ్ కుమార్ సమక్షంలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్




**కరీంనగర్, జూన్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మానకొండూరు మండలం వెల్ది గ్రామంలో రూరల్ ఏసీపీ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం భారీ స్థాయిలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 72 మంది పోలీసు సిబ్బంది పాల్గొని గ్రామ ప్రజలతో ప్రత్యక్షంగా మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. వాహనాల ధృవీకరణలో 76 ద్విచక్ర వాహనాలు, ఒక త్రిచక్ర వాహనం పరిశీలించారు. అక్రమ ఇసుక రవాణాపై ప్రత్యేక దృష్టి సారించి 11 వాహనాలు, 6 ఇసుక డంపులను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఏసీపీ విజయ్ కుమార్ మాట్లాడుతూ అక్రమ ఇసుక రవాణా, నిల్వలపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. మొదటి తప్పిదానికి జరిమానా, రెండోసారి బైండోవర్, మూడోసారి వాహనాలను శాశ్వతంగా స్వాధీనం చేసుకుంటామని స్పష్టం చేశారు. చట్టాన్ని ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## ఇంగ్లీష్ యూనియన్ స్కూల్ గుర్తింపు రద్దు చేయాలని పిడిఎస్యూ డిమాండ్



**కరీంనగర్, జూన్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా డైరీస్, బెల్టులు, టైలు అమ్ముతూ తల్లిదండ్రులను ఇబ్బందులకు గురి చేస్తున్న ఇంగ్లీష్ యూనియన్ స్కూల్ గుర్తింపును తక్షణమే రద్దు చేయాలని పిడిఎస్యూ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా రాష్ట్ర కోశాధికారి అంగిడి కుమార్ మాట్లాడుతూ పాఠశాలలో గ్రౌండ్, ఫైర్ సేఫ్టీ, అర్హత గల ఫ్యాకల్టీ, సరిపడే టాయిలెట్స్ లేవని, 25% ఉచిత విద్యను కూడా అందించడం లేదని ఆరోపించారు. విద్యా వ్యాపారం చేస్తున్న పాఠశాలపై చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి లోకిని మల్లేష్, జిల్లా ఉపాధ్యక్షులు వెల్ది రాజు పాల్గొన్నారు.

## ఎల్ఎండీ నీటిమట్టం తగ్గడంతో రైతుల్లో ఆందోళన



**కరీంనగర్, జూన్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
లోయర్ మానేరు డ్యామ్ (ఎల్ఎండీ)లో నీటిమట్టం తగ్గిపోవడంతో వానకాలం సాగుపై రైతుల్లో ఆందోళన నెలకొంది. జలాశయం పూర్తి సామర్థ్యం 24.034 టీఎంసీలు కాగా, ప్రస్తుతం కేవలం 6.006 టీఎంసీల నీరు మాత్రమే అందుబాటులో ఉంది. ఎగువ నుండి ఇన్‌ఫ్లో నిలిచిపోగా, 232 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో కొనసాగుతోంది. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తగ్గే సూచనలు ఉండటంతో సాగునీటికి తీవ్ర ఇబ్బందులు తప్పవని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# ధాన్యం కొనుగోలు ప్రక్రియ విజయవంతం

**సిద్ధిపేట, జూన్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
యాసంగి సీజన్‌కు సంబంధించిన వరిధాన్యం కొనుగోలు ప్రక్రియ సిద్ధిపేట జిల్లాలో విజయవంతంగా పూర్తయింది.జిల్లాకు నిర్దేశించిన 4.50 లక్షల మెట్రిక్ టన్నుల లక్ష్యాన్ని అధిగమిస్తూ, 427 కొనుగోలు కేంద్రాల ద్వారా మొత్తం 5,04,161 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించారు. 97,807 మంది రైతుల నుంచి రూ.1,204 కోట్ల విలువైన ధాన్యం కొనుగోలు చేయగా, ఇప్పటికే రూ.1,036 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు కలెక్టర్ కే. హైమవతి తెలిపారు.అకాల వర్షాల సమయంలో ధాన్యం తడవకుండా ప్రత్యేక చర్యలు



తీసుకోవడంతో పాటు, తాగునీరు, నీడ, టార్పాలిన్లు, రవాణా వాహనాలు వంటి సదుపాయాలు రైతులకు కల్పించారు. అదనపు కలెక్టర్ లక్ష్మి కిరణ్ ఆధ్వర్యంలో అధికారులు నిరంతర పర్యవేక్షణ చేయడంతో కొనుగోళ్లు ఎలాంటి ఆటంకాలు లేకుండా జరిగాయి. కొనుగోలు చేసిన ధాన్యం మొత్తం రైస్ మిల్లులు, గోదాములకు తరలించబడిందని అధికారులు తెలిపారు. రైతులు పండించిన ప్రతి గింజకు మద్దతు ధర అందేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ విజయవంతమైన ప్రక్రియలో ప్రజాప్రతినిధులు, రైతులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, రైస్ మిల్లర్లు, రవాణా కాంట్రాక్టర్లు, రెవెన్యూ, వ్యవసాయ, సహకార, పౌర సరఫరాల శాఖల అధికారులు, సిబ్బంది సహకారం అందించారు.

## ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ మినహాయింపు ఇవ్వాలని తపస్ డిమాండ్



**కరీంనగర్, జూన్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న టెట్ సమస్యపై తపస్ కరీంనగర్ జిల్లా శాఖ వినతిపత్రాలు సమర్పించింది. అఖిల భారతీయ రాష్ట్రీయ శైక్షిక్ మహాసంఘ్ (ఏబీఆర్ఎస్ఎం) పిలుపు మేరకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో డిఆర్ఓ స్వామి ద్వారా దేశ ప్రధాని, రాష్ట్ర ముఖ్యమంత్రి, కేంద్ర విద్యాశాఖ మంత్రికి విజ్ఞప్తి చేశారు.సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం 2028 ఆగస్టు 31లోపు ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులు తప్పనిసరిగా టెట్ పాస్ కావాల్సిన పరిస్థితి ఏర్పడిందని, ఇది ఉద్యోగ భద్రతకు ముప్పు అని ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేశారు. ఏప్రిల్ 1, 2010కు ముందు నోటిఫికేషన్ ద్వారా నియామకం పొందిన ఉపాధ్యాయులకు టెట్ అవసరం లేదని అప్పట్లో స్పష్టంగా పేర్కొన్నప్పటికీ, ఇప్పుడు అన్ని సబ్జెక్టులపై పరీక్షలు రాయాల్సిన పరిస్థితి ఉందని వారు తెలిపారు.ఈ నేపథ్యంలో పార్లమెంటు చట్టం ద్వారా ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుండి మినహాయింపు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని తపస్ కోరింది. రాష్ట్ర ప్రభుత్వం కూడా కేంద్రాన్ని ఒప్పించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది.కార్యక్రమంలో తపస్ జిల్లా అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు అన్నమనేని తిరుపతిరావు, జారతి నర్సయ్య, రాష్ట్ర బాధ్యులు బూట్ల పవన్ కుమార్, జిల్లా మండల బాధ్యులు రంగోజు శ్రీనివాస్, రాచకొండ పవన్ కుమార్, కొత్తకొండ సాయన్న, చెల్లోజు అరుణ్ కుమార్, రేండ్ల వెంకటేష్, బొద్దుల సత్యనారాయణ, ఆలూరి శ్రీధర్ రావు, ఆకుల చంద్రశేఖర్, కామిరెడ్డి రాజిరెడ్డి, బైరి సురేష్, తోడెంగ సంపత్, జిట్టవేణి శ్రీను, చేరాల వెంకటేశ్వర్లు, బోయిని శ్రీకాంత్, మేడారం కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి సేవించిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్న పోలీసులు


**కరీంనగర్, జూన్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కరీంనగర్ రూరల్ మండలంలోని మొగ్దుంపూర్ బస్టాండ్ సమీపంలో గంజాయి సేవిస్తున్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.సీఐ నిరంజన్ రెడ్డి సిబ్బందితో కలిసి దాడి జరిపిన సమయంలో కొందరు వ్యక్తులు పారిపోయారు. ఒకరు అనుమానాస్పదంగా తిరుగుతుండగా పట్టుకుని పరీక్షించగా, గంజాయి సేవించినట్లు నిర్ధారణ అయింది. అతను ఆటో డ్రైవర్ దుర్గం సాగర్ (25) అని పోలీసులు తెలిపారు.వైద్య పరీక్షల్లో కూడా గంజాయి సేవించినట్లు తేలడంతో కేసు నమోదు చేసి, న్యాయస్థానంలో హాజరుపరచగా వ్యసన విముక్తి కేంద్రానికి పంపాలని ఆదేశించారు.మత్తు పదార్థాలు లేదా చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.

## ఎల్ నినో ప్రభావం, యూరియా యాప్‌పై రైతులకు అవగాహన సదస్సు



**హుస్నాబాద్, జూన్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
అక్కన్నపేట మండలం రామవరం గ్రామంలో వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీలత ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు జరిగింది.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావం వల్ల వర్షపాతం తగ్గడం, వేడి తరంగాలు పెరగడం, భూగర్భ జలాల మట్టం పడిపోవడం వంటి పరిస్థితులు ఏర్పడి పంట దిగుబడులు తగ్గే అవకాశం ఉందని తెలిపారు. 50--75 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైన తర్వాతే వర్షాధార పంటలు సాగు చేయాలని సూచించారు.నేల పరీక్షల ఆధారంగా మాత్రమే ఎరువులు వినియోగించాలని, అధిక యూరియా వాడకం నేల ఆరోగ్యానికి హానికరమని హెచ్చరించారు. పంట అవశేషాలను కాల్చకుండా భూమిలో కలియదున్నడం ద్వారా నేల సారం పెరుగుతుందని వివరించారు. అదనంగా యూరియా బుకింగ్ యాప్ వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. యాప్ ద్వారా ముందస్తుగా బుకింగ్ చేసుకోవాలని, మొబైల్ నంబర్ లింక్ కాకపోవడం లేదా ఆధార్ సమస్యలు ఎదురైతే సమీప రైతు వేదిక లేదా వ్యవసాయ అధికారులను సంప్రదించాలని సూచించారు.కార్యక్రమంలో గ్రామ రైతులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

## భజన మండలి కళాబృందానికి ఏకో సౌండ్ సిస్టం అందజేత



**పాలకుర్తి, జూన్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
పాలకుర్తి మండలం ఈశాల తక్కల్లపల్లి గ్రామంలోని శ్రీ కోదండరామాలయ భజన మండలి కళాబృందానికి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వ్యాల హరీష్ రెడ్డి శుక్రవారం తన స్వంత ఖర్చుతో ఏకో సౌండ్ సిస్టంను అందజేశారు.దేవాలయంలో నిత్యం జరిగే భజన కార్యక్రమాలు, ఆధ్యాత్మిక సేవలు, సాంస్కృతిక ప్రదర్శనలకు సౌండ్ సిస్టం అవసరమని తెలియజేయగా వెంటనే స్పందించి కొనుగోలు చేసి అందజేశారు.ఈ సందర్భంగా హరీష్ రెడ్డి మాట్లాడుతూ భజన మండలి ఆధ్వర్యంలో జరిగే ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు భవిష్యత్ తరాలకు విలువలను పెంపొందించడంలో కీలకమని, కళలను ప్రోత్సహించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.సౌండ్ సిస్టం అందించినందుకు కళాబృంద సభ్యులు హరీష్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

## అడ్లూరి పై మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ తీవ్ర విమర్శలు



**కరీంనగర్, జూన్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ధర్మపురి నియోజకవర్గంలో అవినీతి, అక్రమాలపై ప్రశ్నిస్తే మంత్రి అడ్లూరి లక్ష్మణ్ సమాధానం చెప్పలేక వ్యక్తిగత విమర్శలకు దిగుతున్నారని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు.కరీంనగర్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లలో, సంక్షేమ హాస్టళ్ల టెండర్లలో కోట్ల రూపాయల అవకతవకలు జరిగాయని, ఇసుక రీచ్‌ల వ్యవహారంలోనూ అనుమానాలు ఉన్నాయని ఆరోపించారు. ప్రజల దృష్టిని మళ్లించేందుకు మంత్రి వ్యక్తిగత ఆరోపణలు, కుల రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు.ప్రజా సమస్యలపై చర్చకు రావాల్సిన కాంగ్రెస్ నాయకులు రాజకీయ డ్రామాలు ఆడుతున్నారని ఆయన అన్నారు. ప్రజల ముందు నిజాలు చెప్పేందుకు సిద్ధమైతే మంత్రి అడ్లూరి లక్ష్మణ్ తన పదవికి రాజీనామా చేసి బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు.ప్రజల తీర్పుపై నమ్మకం ఉంటే పదవిని వదిలి ప్రజల్లోకి రావాలని, ఎవరు ప్రజల కోసం పనిచేశారో, ఎవరు అవినీతికి పాల్పడ్డారో ప్రజలే నిర్ణయిస్తారని కొప్పుల ఈశ్వర్ స్పష్టం చేశారు. మాజీ మంత్రి హరీష్ రావును లక్ష్యంగా చేసుకుని కుల ప్రస్తావనలు చేయడం మంత్రికి తగదని, ప్రజా సమస్యలపై మాట్లాడలేని నాయకులే ఇలాంటి చౌకబారు రాజకీయాలకు పాల్పడతారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

## యూరియా కొరత ఆరోపణలు అవాస్తవం




**అక్కన్నపేట, జూన్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
అక్కన్నపేట మండలంలో యూరియా కొరత, బ్లాక్ మార్కెటింగ్ జరుగుతోందంటూ వచ్చిన వార్తలు వాస్తవానికి విరుద్ధమని మండల వ్యవసాయ అధికారి తస్లీమా సుల్తానా స్పష్టం చేశారు.గ్రోమోర్ ఎరువుల విక్రయ కేంద్రాన్ని తనిఖీ చేసిన ఆమె, అక్కడ 1100 యూరియా బస్తాలు యాప్‌లో నమోదు చేసి రైతులకు పారదర్శకంగా విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఒకేసారి రైతులు ఎక్కువగా రావడంతో క్యూ ఏర్పడిందని, దానిని కొరతగా భావించడం సరైంది కాదని వివరించారు.యూరియా విక్రయం పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో జరుగుతోందని, బుకింగ్ ఐడీ ధృవీకరణ, ఆధార్ నమోదు, వేలిముద్ర లేదా ఓటిపి నిర్ధారణ, బిల్లు జారీ వంటి ప్రక్రియలకు సమయం పడుతుందని చెప్పారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే విక్రయం జరుగుతోందని, అదనపు మొత్తాలు వసూలు చేయడం లేదని, ఇతర ఉత్పత్తులతో లింకేజ్ విక్రయాలు కూడా లేవని తనిఖీలో నిర్ధారణ అయిందన్నారు.యూరియా కొరత, బ్లాక్ మార్కెటింగ్ ఆరోపణలు పూర్తిగా నిరాధారమని స్పష్టం చేస్తూ, ఎరువుల విక్రయాల్లో ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే వ్యవసాయ అధికారులను సంప్రదించాలని సూచించారు.

## బీఎల్ఏ సమావేశం విజయవంతం చేయాలని పిలుపు



**పెద్దపల్లి, జూన్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మంథని నియోజకవర్గంలో ఈ నెల 24న జరగనున్న బూత్ లెవల్ ఏజెంట్ల సమావేశాన్ని విజయవంతం చేయాలని బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి, మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని రాజగృహంలో మండల కోఆర్డినేటర్లతో సమీక్షా సమావేశం నిర్వహించిన ఆయన, పార్టీ సభ్యత్వ నమోదు పై చర్చించారు. 24న మంథని పట్టణంలోని ఎస్ఎల్బీ గార్డెన్‌లో జరిగే సమావేశానికి పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు, అభిమానులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

## వైభవంగా శ్రీ మహాశక్తి దేవాలయ వార్షికోత్సవం



**కరీంనగర్, జూన్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
: శ్రీ మహాశక్తి దేవాలయం షోడశ 16వ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. జగద్గురు శ్రీశ్రీశ్రీ విద్యారణ్య భారతి స్వామి దివ్య పర్యవేక్షణలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు.ఉదయం విశేష అభిషేకాలు, గణపతి పూజ, దీపారాధన, చండీ హోమం వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య జరిగాయి. అనంతరం పూర్ణాహుతితో కార్యక్రమం సంపన్నమైంది.ఈ సందర్భంగా స్వామీజీ భక్తులను ఉద్దేశించి దేవాలయం కోరికలు తీర్చే కేంద్రం కాదు, ఆధ్యాత్మిక స్ఫూర్తి కేంద్రం అని పేర్కొన్నారు. ప్రతిరోజూ సూర్య నమస్కారం ఆచరించాలని, ఐక్యమత్యమే మహా బలం అని ఉపదేశించారు. తలకు నూనె పెట్టుకోవడం ఆరోగ్యానికి ఎంత ముఖ్యమో వివరిస్తూ, దైనందిన అలవాట్లలో మార్పు చేసుకోవాలని సూచించారు.వార్షికోత్సవంలో అశేష సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలను స్వీకరించారు.

## బీసీ కార్పొరేషన్ రుణాలపై బీఎస్పీ ప్రశ్నలు



**హుస్నాబాద్, జూన్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడిచినా బీసీలకు సబ్సిడీ రుణాలు అందించడంలో విఫలమైందని బీఎస్పీ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ పచ్చిమట్ల రవీందర్ గౌడ్ విమర్శించారు.రాజీవ్ యువ వికాసం పేరిట 50 వేల నుండి 10 లక్షల రూపాయల వరకు రుణాలు ఇస్తామని దరఖాస్తులు స్వీకరించినా, ఇప్పటివరకు ఒక్కరికి కూడా రుణం ఇవ్వలేదని ఆయన ఆరోపించారు. జిల్లాలో లక్షలాది నిరుద్యోగ యువత దరఖాస్తులు పెట్టుకున్నా, ప్రభుత్వం భరోసా కల్పించలేదని అన్నారు.గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం నాలుగేళ్లకోసారి 50 వేల రుణాలు ఇచ్చిందని, కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం 33 కార్పొరేషన్లకు నిధులు కేటాయించకపోవడం వల్ల కుల వృత్తులు అభివృద్ధి చెందడం లేదని విమర్శించారు. ప్రతి కార్పొరేషన్‌కు 1000 కోట్ల రూపాయల నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. బీసీలను ఆదుకోకపోతే వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి గుణపాఠం చెప్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు దేగల వెంకటేష్, దుంద్ర రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా చిన్నారులకు అన్నప్రాసన



**ఖానాపూర్, జూన్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నిర్మల్ జిల్లా పెంబి మండలం కేంద్రంలోని అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం ఘనంగా జరిగింది. సర్పంచ్ మల్లెపెల్లి సత్యనారాయణ స్వామి చేతుల మీదుగా సంప్రదాయ పూజల అనంతరం చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన తల్లిదండ్రులు పిల్లలను అంగన్వాడీ కేంద్రాలకు పంపాలని, ప్రభుత్వం పోషకాహారం, అన్ని వసతులు కల్పిస్తోందని పేర్కొన్నారు.కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ విశ్వరూప, ఆయా, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

## బాధితులను కుటుంబ సభ్యులుగా భావించి సేవలందించాలి - డీసీపీ



**పెద్దపల్లి, జూన్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు పెద్దపల్లి జోన్ మహిళా పోలీస్ స్టేషన్‌ను డీసీపీ బి. రామ్ రెడ్డి శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని విభాగాలను పరిశీలించిన ఆయన, బాధితులు పోలీస్ స్టేషన్‌కు వచ్చినప్పుడు వారికి ఆత్మీయత కలిగేలా కుటుంబ సభ్యులుగా భావించి మర్యాదపూర్వకంగా సేవలందించాలని సూచించారు. ఫిర్యాదు నమోదు నుంచి చార్జ్‌షీట్ దాఖలు వరకు ప్రతి అంశాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేసి, నిర్ణీత గడువులో దర్యాప్తు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మహిళలకు సంబంధించిన కేసుల విచారణ వేగవంతంగా, పారదర్శకంగా జరగాలని, కుటుంబ కలహాల కేసుల్లో భార్యాభర్తలకు కౌన్సెలింగ్ నిర్వహించి విడిపోవడం వల్ల కలిగే అనర్థాలను వివరించాలని సూచించారు. ఒకరినొకరు అర్థం చేసుకుంటే జీవితం సుఖమయంగా ఉంటుంది అని డీసీపీ పేర్కొన్నారు. ఈ తనిఖీలో ఏసీపీ జి. కృష్ణ, ఇన్‌స్పెక్టర్ రమేష్ బాబు, మహిళా ఎస్ఐ రాజమణి, సిబ్బంది పాల్గొన్నారు.

## పెద్దపల్లి జిల్లాకు రాష్ట్ర స్థాయి గుర్తింపు



**పెద్దపల్లి, జూన్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
విద్యా ప్రమాణాల పెంపులో రాష్ట్రంలో అగ్రగామిగా నిలిచిన పెద్దపల్లి జిల్లాకు రాష్ట్ర స్థాయి గుర్తింపు లభించింది. హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో శుక్రవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గవర్నర్, ముఖ్యమంత్రి చేతుల మీదుగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షకు విశిష్ట సన్మానం చేసి ప్రశంసా పత్రాన్ని అందజేశారు. విద్యా రంగంలో నాణ్యతాభివృద్ధి, విద్యార్థుల అభ్యాస ఫలితాల మెరుగుదల, పాఠశాలల సమర్థ నిర్వహణలో పెద్దపల్లి జిల్లా ముందంజలో నిలిచినందుకు ఈ గౌరవం లభించింది. వేలాది మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యాశాఖ సిబ్బంది సమక్షంలో ఈ సత్కార కార్యక్రమం ఘనంగా జరిగింది. జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, విద్యా రంగ అభివృద్ధి అందరి సమష్టి కృషి ఫలితమని, భవిష్యత్తులో కూడా విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలని పేర్కొన్నారు.

## నేడు ఖానాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ అంతరాయం

**ఖానాపూర్, జూన్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్**
ఖానాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని అధికారులు తెలిపారు. 33/11ఖఎ సత్తనపల్లి, పాత ఎల్లాపూర్, బీర్‌నంది సబ్‌స్టేషన్‌ల నెలవారీ మరమ్మత్తుల కోసం ట్రాన్స్ఫార్మర్లు, లైన్లలో పనులు చేపట్టనున్నారు. ఈ సమయంలో పరిధిలోని గ్రామాలన్నింటికీ విద్యుత్ అంతరాయం ఉంటుందని, వినియోగదారులు, రైతులు సహకరించాలని కోరారు. రైతులకు త్రీఫేస్ కరెంటు రాత్రి సమయంలో నాలుగు గంటలపాటు అందజేస్తామని విద్యుత్ అధికారులు తెలిపారు.

## వానాకాలం సాగుకు డిండి రిజర్వాయర్ నుంచి నీటి విడుదల

**రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే బాలు నాయక్**



**దేవరకొండ, జూన్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వానాకాలం సాగు సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని రైతులకు సకాలంలో సాగునీరు అందించేందుకు డిండి రిజర్వాయర్ నుంచి ఆయకట్టుకు నీటిని ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ ఇరిగేషన్ శాఖ అధికారులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, "రైతుల సంక్షేమం, వ్యవసాయాభివృద్ధి రాష్ట్ర ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యం" అని పేర్కొన్నారు. విడుదల చేసిన నీటితో డిండి మండల పరిధిలోని ఆయకట్టు ప్రాంతాల్లో సుమారు 20 వేల ఎకరాల్లో వరి సాగు జరగనుందని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టి నీటి పంపిణీ సక్రమంగా జరిగేలా చూడాలని ఆదేశించారు. రైతులు నీటిని సద్వినియోగం చేసుకొని అధిక దిగుబడులు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు



**కరీంనగర్, జూన్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ 56వ జన్మదిన వేడుకలు తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా జరిగాయి. ఖానాపూర్, ఉట్నూర్, హుస్నాబాద్, మానకొండూర్, కరీంనగర్, పెద్దపల్లి జిల్లాలతో పాటు పలు మండలాల్లో పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని కేక్ కట్ చేసి సంబరాలు జరిపారు. ఉపాధి హామీ కూలీలతో కలిసి వేడుకలు నిర్వహించి స్వీట్లు, మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. గ్రామాల వరకు పార్టీ శ్రేణులు వేడుకలను విస్తరించి ప్రజలతో కలిసి ఆనందం పంచుకున్నారు. పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ మాట్లాడుతూ ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం కోసం రాహుల్ గాంధీ నిరంతరం పోరాడుతున్నారని, భారత్ జోడో యాత్ర ద్వారా ప్రజల విశ్వాసాన్ని సంపాదించారని పేర్కొన్నారు. కరీంనగర్‌లో జరిగిన వేడుకల్లో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు మేడిపల్లి సత్యం మాట్లాడుతూ రాహుల్ గాంధీ దేశ ప్రజలతో మమేకమై ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పోరాడుతున్నారని, భవిష్యత్తులో దేశానికి ప్రధానమంత్రి కావాలని ఆకాంక్షించారు. వెలిచాల ప్రజా కార్యాలయంలో, బాబు జగ్జీవన్‌రామ్ చౌరస్తా, ధన్గర్ వాడి పాఠశాలలో కూడా వేడుకలు ఘనంగా జరిగాయి. విద్యార్థులకు పుస్తకాలు, పండ్లు పంపిణీ చేస్తూ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. మానకొండూర్‌లో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో ఆయన మాట్లాడుతూ రాహుల్ గాంధీని ప్రధానమంత్రి చేయడమే మన లక్ష్యం కావాలని, ఆయన ఆశయాల సాధన కోసం ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ వేడుకల్లో కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, ఉపాధి హామీ కూలీలు, విద్యార్థులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని రాహుల్ గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## ఎమ్మార్వోకు సన్మానం



**ఆమనగల్లు, జూన్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
శుక్రవారం అమనగల్ ఎమ్మార్వోను కల్వకుర్తి ఇంచార్జ్ ఎమ్మార్పీఎస్ కసిపాకుల రవికుమార్ మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. అనంతరం ఆయనను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మేడి పాపన్న వర్గానికి చెందిన నాయకులు పాల్గొన్నారు.

## ఖానాపూర్‌లో ఘనంగా అమ్మమాట--అంగన్వాడీ బాట




**తలకొండపల్లి, జూన్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలంలోని ఖానాపూర్ గ్రామంలో శుక్రవారం అమ్మమాట--అంగన్వాడీ బాట కార్యక్రమం జరిగింది. గ్రామ సర్పంచ్ అనితా శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కేంద్రాల ప్రాముఖ్యతను తల్లిదండ్రులకు వివరించారు. ప్రైవేట్ స్కూల్‌లకు పోటీగా అంగన్వాడీ కేంద్రాలు నడుస్తున్నాయని, ఆట--పాటలతో కూడిన ఆహ్లాదకర వాతావరణంలో పిల్లలకు పౌష్టికాహారం, గుడ్డు, పాలు, స్నాక్స్ అందిస్తున్నారని తెలిపారు. రెడున్నరేళ్ల నుంచి ఐదేళ్ల పిల్లలకు అధునాతన పరికరాలతో కూడిన విద్యా సౌకర్యాలు ఉన్నాయని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సెక్రటరీ రాఘవేందర్, ఉప సర్పంచ్ గోపాల్ నాయక్, అంగన్వాడీ ఉపాధ్యాయురాలు టి. నిర్మల, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

## వర్షాకాల సన్నద్ధతపై సమీక్ష



**మిర్యాలగూడ, జూన్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని పట్టణ ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అధికారులను ఆదేశించారు. మున్సిపల్, విద్యుత్, వాటర్ సప్లై, పోలీస్, ఇంజినీరింగ్ శాఖలతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించిన ఆయన, ప్రధాన రహదారులు, డ్రైనేజీలు, చెత్త నిల్వ ప్రాంతాలను వెంటనే శుభ్రపరచాలని సూచించారు. విద్యుత్ సరఫరా అంతరాయం లేకుండా ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు, వైర్లు ముందుగానే పరిశీలించాలని, తాగునీరు స్వచ్ఛంగా అందేలా పైపులైన్ల లీకేజీలను నివారించాలని ఆదేశించారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పోలీస్ శాఖ ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని, మార్కెట్లలో పారిశుధ్య చర్యలు, దోమల నివారణ ఫాగింగ్ కార్యక్రమాలు నిరంతరం నిర్వహించాలని సూచించారు. ఆసుపత్రులు, పాఠశాలల పరిసరాల్లో పరిశుభ్రతకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, రోడ్లు, డ్రైనేజీ, చెరువుల పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ చిలుకూరి సుధా బాలకృష్ణ, వైస్ చైర్మన్ గుడిపాటి శిరీష నవీన్, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## వానలు పడాలే

దండిగా వానలు పడాలే
ధరణి మురవాలే
వానలు పడాలే
వాగు వంకలు నిండాలే!!

పచ్చని పైరు పంటలు పండాలే
చెరువులు నిండాలే
చేపలు దండిగా ఉండాలే
బావులు నిండాలే
బాగా పంటలు పండాలే!!

కర్షకుని కష్టాలు తీరాలే
కర్షకుడు కడుపు నిండా తినాలే
ధరణిలో దండిగా పంటలు పండాలే
అవనిలో అందరూ మురవాలే!!

పల్లెలు పచ్చగా ఉండాలే
పశువుల గాసం దొరకాలే
బాగా వానలు పడాలే
బంగారు పంటలు పండాలి
వానతో వ్యవసాయం ముందుకు సాగాలి
ధరణిలో జనమంతా సంతోషంగా
ఉండాలే !!

**దేవులపల్లి రమేశ్**
**నంగునూర్, సిద్దిపేట జిల్లా**
**9963701294.**




## ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు



**మిర్యాలగూడ, జూన్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను మిర్యాలగూడ పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, "ప్రజాస్వామ్య పరిరక్షణ, సామాజిక న్యాయం, యువత--రైతుల సంక్షేమం కోసం రాహుల్ గాంధీ నిరంతరం పోరాడుతున్న నాయకుడు" అని కొనియాడారు. కాంగ్రెస్ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పట్టణ, మండల కాంగ్రెస్ నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, యువజన--మహిళా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పేదింటి ఆడబిడ్డ వివాహానికి ఆర్థిక సహాయం

-ఉదారత చాటుకున్న కౌన్సిలర్ జెర్కోని మమత రాజు



**ఇబ్రహీంపట్నం, జూన్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పేద కుటుంబానికి చెందిన వధువు వివాహానికి ఆర్థిక సహాయం చేసి ఉదారతను చాటుకున్నారు ఇబ్రహీంపట్నం మున్సిపాల్టీ 5వ వార్డు కౌన్సిలర్ జెర్కోని మమత రాజు.కొంద్రు శోభ, క్రీస్తు శేషులు సాయిలు దంపతుల కుమార్తె కవిత వివాహం సందర్భంగా కౌన్సిలర్ మమత రాజు పెళ్లి కానుకగా రూ.10,116 అందజేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక కార్యకర్తలు పాల్గొన్నారు.

# 2029లో రాహుల్ గాంధీని ప్రధానమంత్రిగా చూడాలి

యాచారం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మోటె శ్రీశైలం





**ఇబ్రహీంపట్నం, జూన్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ 56వ జన్మదిన వేడుకలను యాచారం మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మండల అధ్యక్షుడు మోటె శ్రీశైలం ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలో కేక్ కట్ చేసి, రోగులకు కేక్, పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా శ్రీశైలం మాట్లాడుతూ, "దేశం కోసం ప్రాణాలు అర్పించిన కుటుంబం రాహుల్ గాంధీది. ఆయన ప్రజా వ్యతిరేక విధానాలకు ఎదురొడ్డి పోరాడుతున్నారు. ప్రతి కార్యకర్త ఆయనను ప్రధానమంత్రి చేయడానికి కంకణబద్ధులై పని చేయాలి" అని అన్నారు.దేశ సమైక్యత కోసం రాహుల్ గాంధీ కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు పాదయాత్ర నిర్వహించారని గుర్తుచేశారు. "2029లో రాహుల్ గాంధీని ప్రధానమంత్రిగా చూడాలని ప్రతి ఒక్కరూ కృషి చేయాలి" అని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పేదలకు ఆసరాగా సీఎం సహాయనిధి



**ఇబ్రహీంపట్నం, జూన్ 19 ( నీలగిరి ఎక్స్ ప్రెస్)** సీఎం సహాయనిధి పేదలకు ఆసరాగా నిలిచి ప్రాణాలను కాపాడుతోందని యాచారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మొట్టే శ్రీశైలం అన్నారు. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి సహకారం తొ మల్కిజ్ గూడ గ్రామానికి.చెందిన వరికుప్పల.శంకరయ్య కు సీఎం అర్ ఆఫ్ నుంచి మాజురైన 54000 యాభై నాలుగు వేయిల రూపాయలు చెక్కు మొట్టే శ్రీశైలం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ముఖ్య మంత్రి సహాయ నిధితో నేడు నిరుపేదలు కార్పోరేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొంది ప్రాణాలు కాపాడుకుంటున్నారని తెలిపారు. నిరుపేదల ఆరోగ్యం విషయంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని తెలిపారు.ఈ కార్యక్రమం లో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు గౌరారం వెంకట్ రెడ్డి చీర శేఖర్ , వరికుప్పల యాదయ్య , వార్డు సభ్యులు బోడ మధు , చీర మహేష్ , యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు పాశం జయ ప్రకాష్ , దేంది మధుకర్ రెడ్డి , వరికుప్పల అజయ్ , కావలి రఘు బోడ రమేష్ తదితరులు పాల్గొన్నారు

# తెలంగాణ పబ్లిక్ స్కూల్‌పై రాజకీయాలు చేయడం సిగ్గుచేటు

**ఇబ్రహీంపట్నం, జూన్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన తెలంగాణ పబ్లిక్ స్కూల్ పై రాజకీయాలు చేయడం సిగ్గుచేటు అని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి, మంచాల సహకార సంఘం చైర్మన్ వెదిరే హనుమంత్ రెడ్డి అన్నారు.మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, "పేద పిల్లలు కూడా ధనవంతుల పిల్లల మాదిరిగా అంతర్జాతీయ ప్రమాణాలతో చదువుకోవాలని ప్రభుత్వం పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు చేసింది. కానీ కొందరు తమ రాజకీయ భవిష్యత్తు కోల్పోతామనే భయంతో అవినీతి అంటూ కోడిగుడ్డుపై ఈకలు పీకుతున్నారు" అని విమర్శించారు.స్కూల్ పనులు కమిటీ ద్వారానే



జరిగాయని, ఖర్చులు కూడా కమిటీ ఖాతాల ద్వారా జరిగాయని, అందులో మీ పార్టీ నాయకులే ఉన్నారని వారు ప్రశ్నించారు. "పనులు చేసింది మీరే, లబ్ధి పొందింది మీరే, ఇప్పుడు అవినీతి అంటున్నది మీరేనా?" అని మండిపడ్డారు.ప్రభుత్వం ఎలాంటి కాంట్రాక్టర్లు లేకుండా లైబ్రరీలు, ల్యాబ్‌లు, డిజిటల్ క్లాస్‌రూమ్‌లు, క్రీడా ప్రాంగణాలు, భోజనశాలలు వంటి అన్ని సౌకర్యాలతో స్కూల్‌ను నిర్మించిందని తెలిపారు.స్థానిక శాసనసభ్యుడు మల్ రెడ్డి రంగారెడ్డి గ్రామ అభివృద్ధి కోసం ఇప్పటికే కోట్ల రూపాయల నిధులు ఇచ్చారని, పబ్లిక్ స్కూల్ ఎంపిక కూడా ఆయన చొరవతోనే జరిగిందని పేర్కొన్నారు. అభివృద్ధి పనులను అడ్డుకోవడం రాజకీయంగా మనుగడ కోల్పోతున్నామనే భయంతోనే జరుగుతోందని వారు అన్నారు.ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ స్థానిక నాయకులు, యూత్ కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్ ప్రతినిధులు, గ్రామ పెద్దలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మేడిపల్లి పెద్దమ్మ తల్లి ఆలయంలో చోరీ







**ఇబ్రహీంపట్నం , జూన్ 19 ( నీలగిరి ఎక్స్ ప్రెస్):** యాచారం మండల పరిధిలోని నక్కర్త – మేడిపల్లి గ్రామ శివారులో ఉన్న పెద్దమ్మ తల్లి ఆలయంలో గురువారం రాత్రి చోరీ జరిగింది . రోజువారీగా ఆలయంలో పూజలు చేసేందుకు శుక్రవారం ఉదయం మేడిపల్లి లోని పెద్దమ్మతల్లి ఆలయానికి భక్తులు అమ్మవారి దర్శనానికి వెళ్ళగా అప్పటికే గుడి తాళాలు పగలగొట్టి ఉండడంతో అనుమానం వచ్చి ముదిరాజ్ కులస్తులకు ఈ సమాచారాన్ని హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ చేరవేశారు. దేవాలయం లో ఉన్న అమ్మవారి 30 కిలోల పంచలోహ విగ్రహం, నాగ పడిగే, రెండు గంటలు దొంగలు ఎత్తుకెళ్లినట్టు ముదిరాజ్ సంఘం అధ్యక్షులు కానమోని గణేష్ సత్య నారాయణ...., పోలీసులకు తెలిపారు . హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ సీఐ సత్యనారాయణ, ఘటన స్థలానికి చేరుకొని ఆలయాన్ని పరిశీలించారు. ముదిరాజ్ సంఘం అధ్యక్షులు కానమోని గణేష్, సత్యనారాయణ, వెంకటేష్, కృష్ణయ్య, కమిటీ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# రాజ్యాంగ పరిరక్షకుడు రాహుల్

- మున్సిపల్ చైర్మన్ పత్యనాయక్




**ఆమనగల్లు, జూన్ 19 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** దేశ సమైక్యత, సమగ్రత, రాజ్యాంగ పరిరక్షణకు తపించే వ్యక్తి రాహుల్ గాంధీ అని ఆమనగల్లు మున్సిపల్ చైర్మన్ పత్యనాయక్ అన్నారు. రాహుల్ గాంధీ జన్మదినం సందర్భంగా మున్సిపల్ అధ్యక్షుడు వస్పుల మానయ్య అధ్వర్యంలో శుక్రవారం పట్టణ కేంద్రంలోని రాజీవ్ గాంధీ చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో ఆయన కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచి పెట్టారు. ఈ సందర్భంగా చైర్మెన్ పత్యనాయక్ మాట్లాడుతూ.. దేశాన్ని అభివృద్ధి పథంలోకి నడిపించే సామర్థ్యం ఉన్న నేత రాహుల్ అని చెప్పారు. కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు నాలుగు వేల కిలో మీటర్లకు పైగా పాదయాత్ర చేసి చరిత్ర సృష్టించారన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ వస్పుల శ్రీశైలం, సర్పంచ్ మండ్లి రాములు, నాయకులు అప్పం శ్రీను, కాలే మల్లయ్య, గాజుల సురేష్, విజయ్ నాయక్, ఎంగలి ప్రసాద్, అబ్దుల్ అలీమ్, అండేకార్ రాజు, కరీం, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వస్పుల శ్రీకాంత్, శ్రీను నాయక్, తోట శ్రీను, కొండల్ రెడ్డి, శ్రీను, దేవరశెట్టి మహేష్, కుమార్ గౌడ్, కృష్ణ యాదవ్, కిషన్ నాయక్, ఫిరోజ్, శివ, షఫీ, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

# రాచూర్ కాంగ్రెస్ యూత్ కమిటీ అధ్యక్షుడిగా సతీష్

**వెల్దండ, జూన్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వెల్దండ మండల పరిధిలోని రాచూర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ యూత్ కమిటీ అధ్యక్షుడిగా కోటకడి సతీష్ను శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మట్ట భరత్ గౌడ్ ఆధ్వర్యంలో ఎన్నిక జరిగింది.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు హరికిషన్ నాయక్, నాయకులు కొయ్యల పుల్లయ్య, శివ గౌడ్, ఎండి అఫ్రోజ్, ఎండి సమీర్ తదితరులు పాల్గొన్నారు.అదేవిధంగా వెల్దండ మండల కేంద్రం, చొక్కానపల్లి గ్రామంలో బొడ్రాయి పండుగ నాలుగో వార్షికోత్సవం శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరిగింది. గ్రామ కులదేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటగౌడ్, ఉప సర్పంచ్ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి గిరి గౌడ్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

# అచ్చంపేట--కల్వకుర్తిలో ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు





**అచ్చంపేట/కల్వకుర్తి జూన్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు అచ్చంపేట, కల్వకుర్తి పట్టణాల్లో ఘనంగా జరిగాయి.అచ్చంపేట పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ కేక్ కట్ చేసి, "భావి భారత ప్రధాని రాహుల్ గాంధీ మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తున్నాను" అన్నారు. రాష్ట్ర విజయ డైరీ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి, మాజీ ఎంపీపీ రామనాథం, తాలూకా ఎస్సీ సెల్ అధ్యక్షుడు చింతల రాజగోపాల్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.కల్వకుర్తి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కూడా వేడుకలు ఘనంగా జరిగాయి. మాజీ మంత్రి చిత్తరంజన్ దాస్, మున్సిపల్ కౌన్సిలర్ మబ్బు రామరాజు శాలువా కప్పి కేక్ కట్ చేయించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బృంగి రత్నమాల, మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్, జిల్లా ప్రతినిధి శ్రీకాంత్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు పుస్తకాల రాహుల్, సీనియర్ నాయకులు మిర్యాల శ్రీనివాస్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, కౌన్సిలర్లు, యువజన--మహిళా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# ప్రజాపాలనకు ఆకర్షితులై కాంగ్రెస్‌లో చేరికలు

**ఎలిగేడు, జూన్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు, ప్రజాపాలనకు ఆకర్షితులై, జూలపల్లి మండలానికి చెందిన పలువురు బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం ఎలిగేడు మండలం శివపల్లి గ్రామంలో ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కోనారావుపేట గ్రామానికి చెందిన బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ కూసుకుంట్ల రవీందర్ రెడ్డి, నల్ల రాంరెడ్డి, ఆవుల సంతోష్, మల్లారపు రవీందర్, మల్లారపు సోయి



కిషోర్, రాజారాం రెడ్డి, జైపాల్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, కమలాకర్ రెడ్డి, అనిల్ రెడ్డి, సతీష్ రెడ్డి, సుధీర్ రెడ్డి, తిరుపతి, లింగారెడ్డి, విష్ణుతో పాటు 70 మంది బీఆర్ఎస్, బీజేపీ కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కాంగ్రెస్ కండువా కప్పి విజయరమణారావు పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "ప్రజాపాలనలో భాగస్వాములవ్వడం ద్వారా అభివృద్ధి, సంక్షేమం మరింత విస్తృతం అవుతుంది" అని అన్నారు. ఈ కార్యక్రమంలో జూలపల్లి మండల కాంగ్రెస్ నాయకులు లోక జలపతి రెడ్డి, కొమ్మ పోచాలు, కొముదయం బండి స్వామి, రాజారాం రెడ్డి, పెంట కిషోర్, చుక్కయ్య, కుమార్, సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# స్వర్ణకారుల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

**- కాసోజు రాము చారి**



**ఆమనగల్లు, జూన్ 19 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** తెలంగాణ రాష్ట్రంలో స్వర్ణకారుల కార్పొరేషన్ ఏర్పాటు చేసి తమ వృత్తిని సంరక్షించాలని ఆమనగల్లు విశ్వబ్రాహ్మణ గోల్డ్ స్మిత్ సొసైటీ అధ్యక్షులు కాసోజు రాము చారి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆ సంఘం ఆధ్వర్యంలో పట్టణ కేంద్రంలోని డిప్యూటీ తహసీల్దార్ రాఘవేందర్ కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాము చారి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి ఎన్నో ఏళ్లు గడుస్తున్నా తమ సామాజిక వర్గానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు కాలేదని ఆయన పేర్కొన్నారు. కార్పొరేషన్ లేని కారణంగా స్వర్ణకారుల పరిస్థితి నానాటికి దిగజారి పోతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేట్ సంస్థలు జ్యువెలరీ వ్యాపారం లోకి దిగి పెద్ద ఎత్తున పెట్టుబడులతో నగల దుకాణాలు ఏర్పాటు చేసి మోసపూరిత ప్రకటనలు చేస్తూ తమ స్వర్ణకార వృత్తిని దెబ్బతీస్తున్నారని వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ క్రమంలో తమ సామాజిక ఆర్థిక అభివృద్ధి కోసం ప్రత్యేకంగా స్వర్ణకారుల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, జీవో 272 సవరణ చేసి దానిని పటిష్టంగా అమలుపరిచి స్వర్ణకారులను దొంగ బంగారం రికవరీ నుంచి కాపాడాలని, అలాగే గీత, నేత వృత్తిదారుల మాదిరిగానే స్వర్ణకారులకు 50 ఏళ్లు వయస్సు దాటిన వారికి రూ.5వేలు మంజూరు చేయాలని స్వర్ణకారుల సంక్షేమ సంఘం తహసీల్దార్ కు సమర్పించిన విజ్ఞాపన పత్రంలో కోరారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి చింతోజు రవికిరణ్ చారి, కోశాధికారి కాసోజు జగదీశ్వర్ చారి, ఉపాధ్యక్షులు వివేకానంద చారి, రామాచారి, గౌరవ అధ్యక్షుడు పోలోజు బ్రహ్మాచారి, సహాయ కార్యదర్శి కిరణ్ చారి, సభ్యులు బ్రహ్మాచారి, రంగాచారి, మధుచారి, సాంబమూర్తి, సుభాష్ చారి, సుదర్శన చారి, వెంకటేష్ చారి, యాదగిరి చారి, జగన్ చారి, వెంకటేష్ చారి, వెంకటేష్, రామచంద్రయ్య చారి, రాజేశ్వర చారి, శ్రీనివాసచారి, శ్రీనివాసచారి జగదీశ్వర చారి, వెంకటేష్ సింగ్, అనిల్, లక్ష్మణ్, ఆన్సర్, శ్రీను తదితరులు ఉన్నారు.

# దేశ మార్గదర్శకుడు రాహుల్ గాంధీ

**- యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి క్యామా రాజేష్**




**ఆమనగల్లు, జూన్ 19 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** రేపటి తరానికి మార్గదర్శకుడు రాహుల్ గాంధీ అని రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి క్యామా రాజేష్ అన్నారు. రాహుల్ గాంధీ జన్మదినం సందర్భంగా యూత్ కాంగ్రెస్ కల్వకుర్తి నియోజకవర్గ ఉపాధ్యక్షులు షాబుద్దీన్ ఆధ్వర్యంలో కడ్తాల లోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు పలకలు, ప్లేట్స్, నోట్ బుక్స్, పెన్నులు మరియు ఇతర విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. అన్ని వర్గాలకు పార్టీలో సముచిత స్థానం కల్పించి వారి సంక్షేమానికి రాహుల్ గాంధీ పాటుపడుతున్నారని పేర్కొన్నారు. దేశ ప్రజలను ఏకం చేసేందుకు కన్యాకుమారి నుండి కాశ్మీర్ వరకు భారత్ జోడో యాత్ర చేపట్టారన్నారు. రాహుల్ గాంధీ దేశంలోని యువత, విద్యార్థులు, రైతులు, మహిళలు మరియు బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం నిరంతరం పోరాటం చేస్తున్న ప్రజానాయకుడని కొనియాడారు. సమానత్వం, సామాజిక న్యాయం మరియు ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం ఆయన చేస్తున్న కృషి దేశ ప్రజలకు ఆదర్శంగా నిలుస్తోందన్నారు. చిన్నారుల భవిష్యత్తు విద్యపై ఆధారపడి ఉంటుందని, విద్యార్థులకు అవసరమైన విద్యా సామగ్రిని అందించడం ద్వారా వారి చదువులకు ప్రోత్సాహం లభిస్తుందని పేర్కొన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుతున్న చిన్నారులు మంచి విద్యను అభ్యసించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ప్రతి చిన్నారికి నాణ్యమైన విద్య అందించడం ప్రభుత్వాలు మరియు సమాజం యొక్క బాధ్యత అని అన్నారు. చిన్నారులతో కలిసి జన్మదిన వేడుకలు జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందని, వారి చిరునవ్వులు తమకు మరింత సేవా స్ఫూర్తిని కలిగిస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు పవన్ కల్యాణ్, ప్రవీణ్ గౌడ్, లడ్డు మహేష్, గంజి చంద్రశేఖర్, మణికంఠ అంగన్‌వాడీ సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# అగ్నిప్రమాదంలో గడ్డివాము దగ్ధం


మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది



మంటలు వ్యాపిస్తున్న పశువుల కొట్టం, గడ్డివాము

**- ఫైర్ ఇంజన్‌తో మంటల అదుపు**


సంఘటన స్థలంలో సుల్తానాబాద్ సిఐ రంజిత్ రావు ఎస్ఐ మధుకర్

**ఎలిగేడు, జూన్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ వెనుక భాగంలో 11 కెవి విద్యుత్ వైర్లు తెగి ఇనుప ఫెన్సింగ్‌పై పడటంతో అగ్నిప్రమాదం సంభవించింది. మంటలు పోలీస్ స్టేషన్ సమీపంలోని న్యాతరి శంకరయ్యకు చెందిన పశువుల కొట్టం, గడ్డివాముకు వ్యాపించాయి. వెంటనే ఎస్ఐ మధుకర్ తన సిబ్బందిని అప్రమత్తం చేసి మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. సమాచారం అందుకున్న సుల్తానాబాద్ సీఐ రంజిత్ రావు తక్షణమే స్పందించి, అగ్నిమాపక సిబ్బంది ఫైర్ ఇంజన్‌తో సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. ఎలాంటి ప్రాణ నష్టం జరగకుండా, చుట్టుపక్కల ఇళ్లకు మంటలు వ్యాపించకుండా అధికారులు మంటలను ఆర్పివేశారు.

# పీసీసీ అధ్యక్షుడికి రైతు కమిషన్ నివేదిక అందజేత



హైదరాబాద్, జూన్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): రైతు కమిషన్ రూపొందించిన పంటల మార్పిడి నివేదికను కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, సభ్యురాలు భవానీ రెడ్డి కలిసి పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్కు అందజేశారు. కమిషన్ ఇప్పటికే ఈ నివేదికను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, ఇతర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, అన్ని రాజకీయ పార్టీల అధ్యక్షులకు అందజేస్తోంది. ఈ సందర్భంగా కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి మాట్లాడుతూ, “రైతులు పంటల మార్పిడి వైపు వచ్చేలా ప్రజాప్రతినిధులు తమ నియోజకవర్గాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి” అని సూచించారు.

# సీఐ, ఎస్సైలను మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మార్పీఎస్ నాయకులు




**ఆమనగల్లు, జూన్ 19(నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సైలను ఎమ్మార్పీఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, “పట్టణంలో అందరూ కలిసిమెలిసి ఉండాలి. శాంతిభద్రతలకు ప్రతి ఒక్కరూ సహకరించాలి” అని సూచించారు. కార్యక్రమంలో మేడి పాపన్న ఎమ్మార్పీఎస్ వర్గానికి చెందిన కల్వకుర్తి ఇన్‌చార్జి కసిపాకుల రవికుమార్, అంబేద్కర్ యువజన సంఘం సాంస్కృతిక అధ్యక్షుడు ప్రభు శంకర్, ఎమ్మార్పీఎస్ నాయకుడు ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

**- మున్సిపల్ ఛైర్మన్ పత్యనాయక్**



**ఆమనగల్లు, జూన్ 19 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల ప్రజలు ద్వారా అందజేస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ ఛైర్మన్ పత్యనాయక్ కోరారు. ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులెందుకు దండగ.. అంగన్వాడీ కేంద్రాలు ఉండగా’ అనే నినాదంతో ‘అమ్మమాట – అంగన్వాడీ’ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డులోని 3వ అంగన్వాడీ కేంద్రాల్లో బడి బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ ఛైర్మన్ పత్యనాయక్, కమిషనర్ రాఘవేందర్ రెడ్డి లు హాజరై మాట్లాడుతూ.. 3ఏళ్లు నిండిన పిల్లలందరినీ అంగన్వాడీ కేంద్రాల్లో చేర్పించాలన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా అంగన్వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. పిల్లలకు ఉచితంగా యూనిఫాంలు కూడా ఇస్తున్నందున ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్స్ సంధ్య, సునీత, రజిత, రాజ్యలక్ష్మి, నాజీమా, విమల మరియు తల్లులు, పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

# రాచూర్ కాంగ్రెస్ యూత్ కమిటీ అధ్యక్షుడిగా సతీష్



**వెల్దండ, జూన్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వెల్దండ మండల పరిధిలోని రాచూర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ యూత్ కమిటీ అధ్యక్షుడిగా కోటకడి సతీష్ను శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మట్ట భరత్ గౌడ్ ఆధ్వర్యంలో ఎన్నిక జరిగింది. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు హరికిషన్ నాయక్, నాయకులు కొయ్యల పుల్లయ్య, శివ గౌడ్, ఎండి అఫ్రోజ్, ఎండి సమీర్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా వెల్దండ మండల కేంద్రం, చొక్కానపల్లి గ్రామంలో బొడ్రాయి పండుగ నాలుగో వార్షికోత్సవం శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరిగింది. గ్రామ కులదేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటగౌడ్, ఉప సర్పంచ్ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి గిరి గౌడ్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

# కేతి బచావో అభియాన్ అవగాహన సదస్సు

**రైతులకు చిరుధాన్యాల ప్రాముఖ్యతపై వివరణ**




**తెలకపల్లి, జూన్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలకపల్లి మండలంలోని కారువంగా గ్రామ రైతు వేదిక వద్ద కేతి బచావో అభియాన్ అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమాన్ని కృషి విజ్ఞాన కేంద్రం పాలెం, జాతీయ చిరుధాన్యాల పరిశోధనా సంస్థ రాజేంద్రనగర్, మరియు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. సీనియర్ సైంటిస్టులు డాక్టర్ సేవా నాయక్, ఓ. సంతోష్ కుమార్ గుప్తా రైతులకు చిరుధాన్యాల సాగు, వాటి పోషక విలువలను వివరించారు. వ్యవసాయ అధికారి శ్రీమతి నర్మదా వానాకాలం సాగు ముందస్తు చర్యలపై సూచనలు ఇచ్చారు. సస్యరక్షణ శాస్త్రవేత్త డాక్టర్ ఓ. శైల సమగ్ర సస్యరక్షణ యాజమాన్యంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ గౌని శ్రావ్య, గ్రామ సర్పంచ్ అమరేందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కోసిరెడ్డి రమణారెడ్డి, గ్రామ పెద్దలు జంగయ్య, అలాగే 22 మంది రైతులు పాల్గొన్నారు. డాక్టర్ ఓ. శైల (సీనియర్ సైంటిస్ట్ అండ్ హెడ్, కెవికె పాలెం) ప్రత్యేకంగా హాజరయ్యారు.

# సుల్తాన్‌పూర్‌లో అక్షరాభ్యాసం



**ఎలిగేడు, జూన్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** సుల్తాన్‌పూర్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం అక్షరాభ్యాస కార్యక్రమం ఘనంగా జరిగింది. గ్రామ సర్పంచ్ కవ్వంపల్లి బాపయ్య, మండల విద్యాధికారి ఏ. నరేంద్ర చారి, ఉప సర్పంచ్ టి. రమేష్ రావు అతిథులుగా పాల్గొని కొత్తగా పాఠశాలలో చేరిన చిన్నారులను పూలబుగ్గలతో స్వాగతించారు. తరువాత పిల్లలతో కలిసి సరస్వతి పూజ చేసి అక్షరాభ్యాసం చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు అప్పిడి సంతోష్ రెడ్డి, ఉపాధ్యాయులు సిహెచ్. స్రవంతి, పి. సుధాకర్, డి. దీప, మూర్తి, కుమారస్వామి, అమరేందర్, రమాదేవి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# బి.ఎల్.ఓ లకు అవగాహన శిక్షణసమావేశం



**దేవరకొండ జూన్ 19. (నీలగిరి ఎక్స్ ప్రెస్) .**
భారత ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎస్.ఐ.ఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని దేవరకొండ ఆర్డీవో పి. పద్మ ప్రియ కోరారు. కొండమల్లేపల్లి మండల పరిధిలోని బిఎల్ఓ లకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్ శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా వచ్చే నెలలో నిర్వహించబోయే సర్ కార్యక్రమాన్ని ఏ విధంగా చేపట్టాలో బిఎల్ఓ లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొండమల్లేపల్లి మండల తహసిల్దార్ మన్నె నరేందర్ , ఎలక్షన్ డిటి ప్రశాంత్ , ఆర్ ఐ శ్రీనివాస్, ఆంజనేయులు, మాస్టర్ ట్రైనర్లు కట్టెబోయినశ్రీనివాసులు, వాసి కర్ల రమేష్, బిఎల్వోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు



**దేవరకొండ జూన్ 19. (నీలగిరి ఎక్స్ ప్రెస్).**
దేవరకొండ శాసనసభ్యులు నేనావత్ బాలు నాయక్ ఆదేశానుసారం,యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు జక్కిడి శివ చరణ్ రెడ్డి సూచన మేరకు యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జరుపుల లక్ష్మీ ఆధ్వర్యంలో డిండి మండలం ప్రతాప్ నగర్ గ్రామంలోని ఎంపీపీ ఎస్ పాఠశాల లో దేశంలో ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తున్న నియంత ప్రభుత్వంపై రాజీలేని పోరాటం చేస్తున్న పోరాట యోధుడు జననాయకుడు కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకులు లోక్ సభ ప్రతిపక్ష నేత యంగ్ డైనమిక్ లీడర్ రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది.యువజన కాంగ్రెస్ నాయకులు కేక్ కట్ చేసి విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో డిండి మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బద్దేల శ్రీనివాస్, గోనబోయినపల్లి గ్రామ సర్పంచ్ బాలనారాయణ, వార్డు సభ్యులు భాస్కర్, రాములు,కేతవత్ లాలి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బిచ్చులు,లాలు , నారయ్య, వేముల బాలకృష్ణ సోషల్ మీడియా కో - ఆర్డినేటర్ గణేష్,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నర్సాపూర్‌లో ఘనంగా పెద్దమ్మతల్లి బోనాలు



పెద్దమ్మ తల్లికి మొక్కులు చెల్లించుకుంటున్న రాష్ట్ర బిజెపి కార్యవర్గ సభ్యులు నల్ల మనోహర్ రెడ్డి.

**ఎలిగేడు, జూన్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఎలిగేడు మండలంలోని నర్సాపూర్ గ్రామంలో ముదిరాజ్ కులస్తుల ఆరాధ్యదైవమైన పెద్దమ్మతల్లి బోనాల పట్నాల ఉత్సవాలు శుక్రవారం అత్యంత వైభవంగా జరిగాయి.
ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, నల్ల ట్రస్ట్ అధినేత నల్ల మనోహర్ రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, "ప్రజలంతా సుభిక్షంగా ఉండాలి, సమృద్ధిగా వర్షాలు కురవాలి" అని పెద్దమ్మతల్లి వద్ద ప్రార్థించారు.ఆయన వెంట బీజేపీ నాయకుడు వేణుగోపాల్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.గ్రామమంతా భక్తి శ్రద్ధలతో నిండిపోయి, సంప్రదాయ బోనాలతో ఊరేగింపులు, పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించబడ్డాయి.

## గొడ్డలితో కన్నతల్లిని హత్య చేసిన కూతురు

**కరీంనగర్, జూన్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నగరంలోని త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణ ఘటన చోటుచేసుకుంది. మానసిక సమస్యలతో బాధపడుతున్న సుధ (51) గొడ్డలితో దాడి చేసి తన తల్లి మేరీని హతమార్చింది. రిటైర్డ్ టీచర్ భూపాల్ రెడ్డి కుటుంబంలో ఈ విషాదం చోటుచేసుకుంది. ఉదయం సుధ ఆవేశంతో గొడ్డలి పట్టుకుని తండ్రిపైకి దూసుకెళ్లి, అనంతరం తల్లి తలపై, నుదుటిపై దాడి చేసింది. తీవ్ర రక్తస్రావంతో మేరీ అక్కడికక్కడే మృతి చెందింది.సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. భూపాల్ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.


# అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలకు ఎమ్మెల్యేకు ఆహ్వానం

**సుల్తానాబాద్, జూన్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
సుల్తానాబాద్ వాకర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ విజయ రమణారావును ఈరోజు ఉదయం కలుసుకున్నారు. ఆదివారం సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలకు ఆహ్వానం అందజేశారు.ఈ సందర్భంగా వాకర్ సభ్యులు గ్రౌండ్‌లో ఎదుర్కొంటున్న సమస్యలను వివరించి, శిథిలావస్థలో ఉన్న జిమ్‌ను బాగు చేయించి సభ్యులకు ఉపయోగపడేలా చూడాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం సమర్పించారు.కార్యక్రమంలో వాకర్ అసోసియేషన్ అధ్యక్షుడు చొప్పరి సుమన్, కార్యదర్శి నిట్టూరి శ్రీనివాస్, కోశాధికారి కామని శ్రీకాంత్, కార్యవర్గ సభ్యులు మరియు పెద్ద ఎత్తున వాకర్ సభ్యులు పాల్గొన్నారు.



# యాక్సెంచర్ షాక్..

- కుప్పకూలిన స్టాక్ మార్కెట్లు..
- 1.35 లక్షల కోట్లు ఆవిరి




**ముంబై:్, జూన్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
భారతీయ ఐటీ దిగ్గజ కంపెనీలు అనూహమైన షాక్‌కు గురయ్యాయి.సుమారు 1.35 లక్షల కోట్ల విలువైన స్టాక్స్ కుప్పకూలినట్లు తెలుస్తోంది. గ్లోబల్ ఐటీ కన్సల్టెన్సీ యాక్సెంచర్ కంపెనీ ఇచ్చిన రెవన్యూ రిపోర్టు.. భారతీయ ఐటీ కంపెనీలను తీవ్రంగా షేక్ చేసింది. శుక్రవారం ట్రేడింగ్‌లో ఐటీ కంపెనీల స్టాక్స్ దారుణంగా పడిపోయాయి. ఇన్ఫోసిస్ కంపెనీలో 8.5 శాతం ట్రేడింగ్ తగ్గిపోయింది. స్టాక్ ఎక్స్‌చేంజ్ ట్రేడింగ్‌లో ఇవాళ ఇన్ఫోసిస్ కంపెనీ షేర్లు 8.59 శాతం, టెక్ మహేంద్ర షేర్లు 7 శాతం, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ షేర్లు 6.52, హెచ్‌సీఎల్ టెక్ షేర్లు 6 శాతం, విప్రో షేర్లు 4.29 శాతం పడిపోయాయి.యాక్సెంచర్ ఇచ్చిన ఆదాయ రిపోర్టు నేరుగా భారతీయ ఐటీ కంపెనీల స్టాక్స్‌పై ప్రభావం చూపింది. కృత్రిమ మేధ వల్ల వృద్ధి తగ్గనున్నట్లు ఇటీవల యాక్సెంచర్ కంపెనీ తన ఆదాయ రిపోర్టును అంచనా వేసింది. ఆ నివేదిక ఇప్పుడు భారతీయ ఐటీ కంపెనీల్లో వణుకు పుట్టించింది. శుక్రవారం స్టాక్ మార్కెట్‌లో ట్రేడింగ్ ఒక్కసారిగా కుదేలైంది. టెకీ ప్రాజెక్టుల కోసం ఎక్కువగా ఇండియన్ కంపెనీలన్నీ యాక్సెంచర్ సంస్థపైనే ఆధారపడడం వల్ల.. యాక్సెంచర్ ఇచ్చిన రిపోర్టు భారత ఐటీ కంపెనీలపై తీవ్ర ప్రభావాన్ని చూపింది. యావత్ ఐటీ రంగానికి యాక్సెంచర్ వార్నింగ్ ఇవ్వడంతో.. పెట్టుబడిదారులు తమ స్టాక్స్‌ను తీసేసుకుంటున్నట్లు బజాజ్ బ్రోకింగ్ నిపుణుడు శశ్వంత్ సింగ్ తెలిపారు. గత అయిదు రోజుల నుంచి దూకుడును ప్రదర్శించిన స్టాక్ మార్కెట్లు ఇవాళ అనూహ్య రీతిలో స్పందించాయి. సెన్సెక్స్, నిఫ్టీల్లో ట్రేడింగ్ అకస్మాత్తుగా పడిపోయింది. యాక్సెంచర్ ఇచ్చిన గైడెన్స్ సందేశం. భారతీయ ఐటీ కంపెనీలను తీవ్ర భయాందోళనల్లోకి నెట్టేసినట్లు జియోజిట్ ఇన్వెస్ట్‌మెంట్స్ లిమిటెడ్ స్ట్రాటజిస్ట్ వీకే విజయకుమార్ తెలిపారు.

# ఆర్టీసీ కార్గో పార్సెల్ కేంద్రంలో పోలీసుల ఆకస్మిక తనిఖీలు




**కరీంనగర్, జూన్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
నగరంలోని బస్టాండ్, ఆర్టీసీ కార్గో పార్సెల్ కేంద్రంలో పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మాదకద్రవ్యాల దుర్వినియోగం నివారణ చర్యల్లో భాగంగా పోలీసు జాగిలం లియోతో కూడిన బృందం తనిఖీల్లో పాల్గొంది. పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం మాట్లాడుతూ ప్రజల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణ కోసం భద్రతా చర్యలను మరింత కట్టుదిట్టం చేశామని తెలిపారు. రద్దీ ప్రాంతాల్లో విస్తృత స్థాయిలో తనిఖీలు, ప్రధాన కూడళ్లలో వాహన తనిఖీలు కొనసాగుతున్నాయని చెప్పారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపిస్తే వెంటనే డయల్ 100 లేదా పోలీసు కంట్రోల్ రూమ్ మొబైల్ నంబర్ 8712670744కు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో కమిషనరేట్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రాథమిక పాఠశాలలో అడ్మిషన్లపై అవగాహన సదస్సు



**కోహెడ, జూన్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కోహెడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో సంఘీ నగర్ ప్రాథమిక పాఠశాలలో అడ్మిషన్ల అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు తిరుపతిబాయి, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు మీలా విజయ్ కుమార్ విద్యార్థులు, తల్లిదండ్రులకు పాఠశాలలో అందుబాటులో ఉన్న విద్యా సదుపాయాలు, నాణ్యమైన బోధన, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, భవిష్యత్ అవకాశాలపై వివరించారు. సంఘీ నగర్‌లో ఉన్నత పాఠశాల లేకపోవడంతో ప్రత్యేక చొరవ తీసుకొని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కోహెడ పాఠశాలకు రవాణా సౌకర్యం సైతం అనుకూలంగా ఉందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంఘీ నగర్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుగంధ కూడా పాల్గొన్నారు.

# ఢిల్లీలో మహిళా పోలీస్ స్టేషన్ ప్రారంభం..

## సిబ్బంది అంతా మహిళలే



**న్యూఢిల్లీ,్, జూన్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఢిల్లీలో మొదటి మహిళా పోలీస్ స్టేషన్ ప్రారంభమైంది. నార్త్ ఢిల్లీలోని సుబ్జి మండి ఏరియాలో ఏర్పాటు చేసిన ఈ మహిళా పోలీస్ స్టేషన్‌ను లెఫ్టినెంట్ గవర్నర్ తరంజిత్ సింగ్ సంధూ, ఢిల్లీ పోలీస్ కమిషనర్ సతీష్ గోల్చా శుక్రవారం ప్రారంభించారు. పూర్తిగా మహిళా పోలీసులు, సిబ్బందితోనే నడవడం ఈ పోలీస్ స్టేషన్ ప్రత్యేకత. పోలీస్ స్టేషన్ ప్రారంభించిన సందర్భంగా ఎల్జీ తరంజిత్ సింగ్ మాట్లాడుతూ.. మహిళలు ఫిర్యాదు చేసేందుకు, సహాయం కోరేందుకు ఈ ప్రత్యేక మహిళా పోలీస్ స్టేషన్ ఉపయోగపడుతుందన్నారు.రాబోయే రోజుల్లో ఢిల్లీ పరిధిలోని ఇతర జిల్లాల్లో కూడా ఇలాంటి మహిళా పోలీస్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. దీనిపై పోలీసు అధికారులు స్పందించారు. మహిళలపై జరుగుతున్న నేరాలను అరికట్టేందుకు, వారి సమస్యలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టేందుకు మహిళా పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేసినట్లు వివరించారు. గృహహింస, లైంగిక వేధింపులు, నిఘా, దాడులు సహా మహిళలపై జరుగుతున్న అనేక నేరాలపై దృష్టి పెట్టేందుకు మంచి అవకాశం దొరుకుతుందన్నారు. నేరాల్ని అడ్డుకోవడం, విచారణ, పరిష్కారం వంటి అంశాలకు ప్రాధాన్యమిస్తామన్నారు. బాధితుల కోణంలో పని చేస్తామన్నారు. కేసు విచారణ జరిపే పోలీసుల దగ్గరి నుంచి సపోర్టింగ్ స్టాఫ్ వరకు మొత్తం మంది మహిళలే ఉండటం ఈ పోలీస్ స్టేషన్ ప్రత్యేకత. అధికారి స్థాయి నుంచి కింది స్థాయి వరకు సిబ్బంది అందరూ మహిళలే. ఇదే సమయంలో జనం సమస్యలు వినేందుకోసం 'జన్ సున్‌వాయి' కార్యక్రమాన్ని కూడా ఎల్జీ తరంజిత్ సింగ్ ప్రారంభించారు. ఢిల్లీ పరిధిలోని పోలీస్ స్టేషన్లలో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించేందుకు, వారికి సులభంగా పోలీసులు అందుబాటులో ఉండేందుకు ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందన్నారు. ఇక్కడ సీనియర్ ఉన్నతాధికారులు అందుబాటులో ఉండి సమస్యల్ని త్వరగా పరిష్కరిస్తారని చెప్పారు. పోలీసింగ్ కంటే, కౌన్సెలింగ్, అవేర్‌నెస్ కల్పించడమే తమ ఉద్దేశ్యమన్నారు.

# బిజినెస్

## రికార్డు సృష్టించిన జియో..

**తొలిసారి రూ.30వేల కోట్ల ప్రాఫిట్**




2025–26 ఆర్థిక సంవత్సరంలో రిలయన్స్ జియోకు రూ.30,000 కోట్ల ఆదాయం సమకూరినట్లు జియో ప్లాట్ ఫామ్స్ మేనేజింగ్ డైరెక్టర్ ఆకాష్ అంబానీ తెలిపారు. శనివారం జరిగిన రిలయన్స్ 49వ వార్షిక సర్వసభ్య సమావేశంలో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. జియో చరిత్రలో తొలిసారి పన్నుల తర్వాత లాభం రూ.30 వేల కోట్లు దాటిందని, ఇది ఒక కొత్త రికార్డు అని పేర్కొన్నారు. ప్రస్తుతం జియో వినియోగదారుల సంఖ్య 52.4 కోట్లకు చేరిందని, దేశంలోనే అతిపెద్ద టెలికాం ఆపరేటర్‌గా జియో తన స్థానాన్ని మరింత బలోపేతం చేసుకుందని ఆయన తెలిపారు.

## భారీగా నష్టపోయిన స్టాక్ మార్కెట్..

### సెన్సెక్స్ 600 పాయింట్లు పతనం




భారత స్టాక్ మార్కెట్లు శుక్రవారం భారీగా నష్టపోయాయి. వరుసగా ఐదు సెషన్లలో లాభాలు పొందిన స్టాక్ మార్కెట్ శుక్రవారం నష్టాల బాటలో నడిచింది. సెన్సెక్స్, నిఫ్టీ నష్టాల్లో ముగిశాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 607.08 పాయింట్లు (0.78%) నష్టపోయి 76,802.90 పాయింట్ల వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ50 కూడా 155.05 పాయింట్లు (0.64%) నష్టపోయి 24,013.10 పాయింట్ల వద్ద ముగిసింది. ఒక దశలో బీఎస్ఈ సెన్సెక్స్ 940.26 పాయింట్లు నష్టపోయి 76,469.72 కనిష్టానికి చేరింది.గ్లోబల్ ఐటీ దిగ్గజ కంపెనీ యాక్సెంచర్ ప్రకటించిన త్రైమాసిక ఫలితాలు నిరాశాజనకంగా ఉండటం, గతంలో ప్రకటించిన 5 శాతం రెవెన్యూ వృద్ధి అంచనాలను 4 శాతం తగ్గించడం మారట?ట్‌లో ఐటీ షేర్ల పతనానికి దారితీసింది. యాక్సెంచర్ ప్రకటనతో దేశీయ ఐటీ షేర్లు భారీగా నష్టపోయాయి. నిఫ్టీ ఐటీ ఇండెక్స్ 3.65 శాతం పతనమైంది. అమెరికా మార్కెట్లో యాక్సెంచర్ షేర్లు 18 శాతం పతనమయ్యాయి. భారతీయ ఐటీ కంపెనీలకు సంబంధించి ఇన్ఫోసిస్ 6.5 శాతం, టీసీఎస్ 3.06 శాతం, టెక్ మహీంద్రా 2.3 శాతం, హెచ్‌సీఎల్ టెక్నాలజీ 2.23 శాతం, మహీంద్రా అండ్ మహీంద్రా 1.81 శాతం, విప్రో 1.28 శాతం నష్టపోయాయి. బీఎస్ఈలో ఎటర్నల్, పవర్ గ్రిడ్, భారతి ఎయిర్‌టెల్, టైటాన్, సన్‌ఫార్మా, ఎన్టీపీసీ, ఐటీసీ, ట్రెంట్, ఎల్ అండ్ టీ షేర్లు లాభాలు పొందాయి. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, మహీంద్రా అండ్ మహీంద్రా, రిలయన్స్ ఇండస్ట్రీస్, హిందుస్తాన్ యునీలీవర్ సంస్థలు నష్టపోయాయి. డాలర్‌తో రూపాయి మారకం విలువ 7 పైసలు పెరిగి, 94.33 వద్ద కొనసాగింది. మరోవైపు అంతర్జాతీయంగా చమురు ధరలు తగ్గుముఖం పడుతున్నాయి. అమెరికా, ఇరాన్ మధ్య ఒప్పందం కుదరడం, హార్ముజ్ జలసంధి పూర్తిస్థాయిలో అందుబాటులోకి రావడంతో చమురు ధరలు 1 శాతం పైగా పతనమయ్యాయి. బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 78.33 డాలర్లుగా, డబ్ల్యూటీఐ (వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్) క్రూడాయిల్ ధర కూడా 1 శాతం పైగా తగ్గి 75.88 డాలర్ల వద్ద కొనసాగింది.

## ఒక్కసారి చార్జ్ చేస్తే 170 కిలోమీటర్లు ఆగేదే లేదు..
## ప్రతీ నెలా రూ.3 వేలు ఆదా..

పెట్రోల్, డీజిల్ ధరలు నానాటికి పెరుగుతుండటంతో.. సామాన్యులపై భారం పడుతుంది. ప్రతీ నెలా రూ.3 వేల వరకు ఇంధనంపై ఖర్చు పెట్టాల్సి వస్తోంది. ఆర్థిక పరిస్థితి బాలేక ఇబ్బందులు పడే సామాన్య, మధ్యతరగతి ప్రజలకు ఇది పెద్ద భారమనే చెప్పుకోవాలి. దీంతో ఇటీవల కాలంలో ఎలక్ట్రిక్ వెహికల్స్ వైపు ఎక్కువమంది ఆసక్తి చూపిస్తున్నారు. వీటి వల్ల ఇంధనంపై పెట్టు ఖర్చు తగ్గుతుంది. తక్కువ ధరలోనే ఈవీ వెహికల్స్ మార్కెట్లో లభిస్తున్నాయి. దీంతో పెట్రోల్ డబ్బులు ఆదా చేసుకునేందుకు వీటిని కొనుగోలు చేస్తున్నారు. వీటిని ఉన్న డిమాండ్ దృష్ట్యా కంపెనీలన్నీ ఈవీ వాహనాలను మార్కెట్లోకి లాంచ్ చేస్తున్నాయి. తక్కువ ధరలో ఎక్కువ మైలేజ్ వచ్చే ఓలా ఎలక్ట్రిక్ స్కూటర్ గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

**ఒక్కసారి ఛార్జ్ చేస్తే రయ్.. రయ్**



ఓలా S1X ఎలక్ట్రిక్ స్కూటర్ గురించి ఇప్పుడు పెద్ద ఎత్తున చర్చ నడుస్తోంది. ఒక్కసారి ఫుల్ చార్జ్ చేస్తే 176 కిలోమీటర్ల రేంజ్‌ను అందిస్తోంది. ఇక ట్రాఫిక్ ఎక్కువగా ఉండే సిటీ రోడ్లపై 110 కిలోమీటర్ల వరకు ప్రయాణం చేస్తుంది. అదే మీరు సిటీలో రోజూ 40 కిలోమీటర్లు ప్రయాణం చేస్తుంటే.. మూడు రోజులకు ఒకసారి ఛార్జ్ చేస్తే సరిపోతుంది. ప్రస్తుతం పెట్రోల్ వెహికల్‌కు కిలోమీటర్లకు రూ.2 నుంచి రూ.2.5 ఖర్చు అవుతుంది. మీరు రోజూ 40 కిలోమీటర్లు ప్రయాణం చేస్తుంటే నెలకు రూ.3 వేలు ఖర్చు అవుతుంది. ఎలక్ట్రిక్ వెహికల్ వాడితే కిలోమీటర్‌కు 20 నుండి 30 పైసలు మాత్రమే ఖర్చు అవుతుంది. ఇక పెట్రోల్ వెహికల్ ఉంటే ఇంజిన్ ఆయిల్ మార్చడం, ఎయిర్ ఫిల్టర్ క్లీన్ చేయడం, క్లచ్ ప్లేట్లను గ్రైండింగ్ చేయడం లాంటి వాటికి అదనపు ఖర్చు అవుతుంది. అదే ఈవీ వాహనాలకు లాంటి ఖర్చు ఏమీ ఉండదు. రూ.లక్షలోపు ధరలోనే ఈ వెహికల్ లభిస్తుంది. ఇదే వేరియెంట్‌తో ఇతర కంపెనీల వెహికల్ ధరలు రూ.లక్షపైనే ఉన్నాయి. కానీ ఓలా రూ.లక్షలోపే ధరలో ప్రీమియం ఫీచర్లను అందిస్తోంది. ఇది హైస్పీడ్ వెహికల్ కావడంతో స్పీడ్ కూడా వెళ్లవచ్చు.

## ఐపీఎల్ 2027 షెడ్యూల్ లో మార్పు?

తీవ్రమైన ఎండలు, వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ఐపీఎల్ 2027 షెడ్యూల్‌లో కీలక మార్పులు చేయాలని బీసీసీఐ భావిస్తోంది. టోర్నీని రెండు వారాలు ముందే, అంటే మార్చి 10 నుంచి మే 15 మధ్య నిర్వహించేందుకు చర్చలు జరుగుతున్నాయని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా తెలిపారు. అయితే ఐపీఎల్ మ్యాచ్‌ల సంఖ్యను 74 నుంచి 94కు పెంచే ఆలోచన ప్రస్తుతానికి లేదని, అంతర్జాతీయ ద్వైపాక్షిక సిరీస్‌ల వల్ల రెండు నెలల విండోను విస్తరించడం సాధ్యం కాదని ఆయన స్పష్టం చేశారు. భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ).. ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) షెడ్యూల్‌లో కీలక మార్పు చేయాలని భావిస్తోంది. 2027 సీజన్ నుంచి టోర్నమెంట్‌ను కాస్త ముందుగానే ప్రారంభించాలని యోచిస్తోంది. ఎండలు, తీవ్రమైన వాతావరణ పరిస్థితుల వల్ల ఆటగాళ్లు, అభిమానులు ఇబ్బంది పడటంతో పాటు.. మ్యాచ్ నిర్వహణ కూడా కష్టంగా మారుతోందని బీసీసీఐ భావిస్తోందట. అందుకే కాస్త ముందుగానే సీజన్ ప్రారంభించాలని యోచిస్తున్నట్లు సమాచారం. సాధారణంగా అయితే మార్చి చివరి నుంచి మే చివరి వరకు ఉండే ఐపీఎల్ షెడ్యూల్




ఉంటుంది. ఐపీఎల్ 2026 షెడ్యూల్ సైతం.. మార్చి 28న మొదలై, మే 31 వరకు కొనసాగింది. దానిని ఇకపై మార్చి 10 నుంచి మే 15 మధ్యకు మార్చేందుకు చర్చలు జరుగుతున్నాయని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా వెల్లడించారు. అన్నీ అనుకున్నట్లు సాగితే 2027 ఐపీఎల్ సీజన్.. మార్చి రెండో వారంలోనే ప్రారంభమయ్యే అవకాశం ఉంది.దేశంలోని అనేక ప్రాంతాల్లో పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, రుతుపవనాల రాకకు ముందు కురిసే వర్షాల కారణంగా ఐపీఎల్‌లో చివరి మ్యాచ్‌లు ప్రభావితం అవుతున్నాయని దేవజిత్ సైకియా పేర్కొన్నారు. "ఈ సంవత్సరం ఐపీఎల్ మార్చి 28న మొదలై మే 31 నాటికి ముగిసింది. అయితే, మే 15 తర్వాత టోర్నమెంట్ చివరి దశలో వర్షాలు పడే లేదా రుతుపవనాల సీజన్ మొదలయ్యే అవకాశం ఉందనే ఆందోళన ఉంది. మరోవైపు, తీవ్రమైన వేడి వాతావరణం ఆటగాళ్లకు గానీ, ప్రేక్షకులకు గానీ అనుకూలంగా ఉండదు. అందుకే టోర్నీని 2 వారాలు ముందే ప్రారంభించాలని బోర్డు భావిస్తోంది. దీనిపై ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్‌లో చర్చ జరుగుతోంది" అని బీసీసీఐ కార్యదర్శి తెలిపారు."ప్రస్తుతానికైతే ఐపీఎల్‌లో మ్యాచ్‌ల సంఖ్య పెంచడం అనేది సాధ్యం కాదు. 74 మ్యాచ్‌ల ఫార్మాట్‌ను విస్తరించే ప్రణాళికలు ఇప్పుడు లేదు. ఎందుకంటే వివిధ దేశాల నుంచి వచ్చే ఆటగాళ్లకు సంబంధించిన అనేక అంశాలను మనం పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. ఎంతో కష్టపడితేనే ఐపీఎల్ కోసం రెండు నెలల విండో దొరుకుతోంది. అంతకుమించి ఎక్కువ సమయం కేటాయించడం అనేది చాలా కష్టం. ఎందుకంటే ఇతర దేశాలు కూడా ద్వైపాక్షిక సిరీస్‌లు ఆడాల్సి ఉంటుంది. బట్టి, మ్యాచ్‌ల సంఖ్యను 74 నుంచి 94కు పెంచే విషయంపై ప్రస్తుతం ఎలాంటి చర్చా జరగట్లేదు" అని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా వెల్లడించారు.

## టీమ్ ఇండియాకు ధోని లాంటి మెంటార్ కావాలి!

భారత క్రికెట్ జట్టు హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ లక్ష్యంగా మాజీ పేసర్ ఎస్. శ్రీశాంత్ చేసిన కొన్ని ఘాటు వ్యాఖ్యలు ఇప్పుడు క్రికెట్ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి. ప్రస్తుతం ఉన్న టీమ్ ఇండియా సెటప్‌కు గౌతమ్ గంభీర్ కంటే ఎంఎస్ ధోని లాంటి వ్యక్తి అవసరమని శ్రీశాంత్ అభిప్రాయపడ్డాడు. టీమ్ ఇండియాకు ప్రస్తుతం ఆటగాళ్లు మనస్ఫూర్తిగా గౌరవించే ఒక మార్గదర్శకుడు కావాలని, అంతేగానీ "ఆటగాళ్ల వెనుక మాట్లాడేవాడు" లేదా టీవీల్లో ప్రశంసల కోసం ప్రాకులాడే వ్యక్తి కాదని గంభీర్‌ను ఉద్దేశించి పరోక్షంగా విమర్శలు గుప్పించాడు. కాగా, ఈ పూర్తి ఇంటర్వ్యూ ఇంకా విడుదల కావాల్సి ఉంది. ఇటీవల న్యూజిలాండ్, సౌతాఫ్రికా వంటి జట్లతో స్వదేశంలో జరిగిన టెస్ట్ మ్యాచ్‌ల్లో భారత్ ఎందుకు ఇబ్బంది పడిందనే ప్రశ్న శ్రీశాంత్‌కు ఎదురవగా.. ఆ ప్రశ్నను మధ్యలోనే అడ్డుకుంటూ.. "అప్పుడు కోచ్ ఎవరు?" అని ఎదురుప్రశ్న వేశాడు. ఆటగాళ్ల ఎంపికకు సంబంధించిన సమస్యలపై స్పందిస్తూ.. దీనికంతటికీ గంభీరే కారణమన్నట్లుగా మాట్లాడాడు. "ముందు కోచ్‌ను మార్చండి. భారత్‌కు ఇప్పుడు కావాల్సింది కోచ్ కాదు, ఒక మంచి మెంటార్" అని శ్రీశాంత్ స్పష్టం చేశాడు. ఒక షో



సజావుగా సాగడానికి డైరెక్టర్ ఎంత ముఖ్యమో, జట్టుకు కోచ్ కూడా అంతే ముఖ్యమని చెబుతూనే.. తనకు సాధారణంగా కోచ్‌లపై ఎలాంటి వ్యతిరేకత లేదని, కానీ అంతర్జాతీయ జట్లకు సాంప్రదాయ కోచ్‌ల కంటే మెంటార్ల అవసరమే ఎక్కువగా ఉంటుందని అభిప్రాయపడ్డాడు. గంభీర్ అనుసరిస్తున్న కోచింగ్ విధానం ఆటగాళ్లపై తీవ్రమైన ఒత్తిడిని పెంచుతోందని శ్రీశాంత్ ఆందోళన వ్యక్తం చేశాడు. ఫెయిల్ అయితే జట్టు నుంచి తీసేస్తామనే భయాన్ని కల్పించి, ఆటగాళ్లను ఒక కఠినమైన వ్యవస్థలోకి నెట్టే కోచ్ జట్టుకు అవసరం లేదని అన్నాడు.దీనికి ఉదాహరణగా ఎంఎస్ ధోనిని ప్రస్తావిస్తూ.. ధోని ఎప్పుడూ అలా వ్యవహరించలేదని చెప్పాడు. "జనాలు ఏమైనా చెప్పుకోవచ్చు.. కానీ ధోని ఆలోచనా విధానం, అతను ఆటగాళ్లలో నింపిన ఆత్మవిశ్వాసమే జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించాయి" అని శ్రీశాంత్ గుర్తుచేశాడు. భారత్ టీ20 ప్రపంచకప్ గెలవడంలో గంభీర్‌కు మితిమీరిన క్రెడిట్ ఇవ్వడం సరికాదని శ్రీశాంత్ వాదించాడు. "మైదానంలో చెమటోడ్చి ఆడేది ఆటగాళ్లు, కాబట్టి ఆ గుర్తింపు, క్రెడిట్ వారికే దక్కాలి" అని అన్నాడు. ప్రపంచకప్ విజయాన్ని ప్రస్తావిస్తూ.. ఆటగాళ్ల ప్రదర్శనే అక్కడ అత్యంత కీలకమని చెప్పాడు. "ఒకవేళ సంజూ శాంసన్ రాణించకపోయినా, సూర్యకుమార్ యాదవ్ కెప్టెన్సీ సరిగ్గా చేయకపోయినా, లేదా సమయానికి బౌలింగ్ మార్పులు జరగకపోయినా మనం గెలిచేవాళ్లమా? మైదానంలోకి వచ్చి కోచ్ ఏమైనా నిర్ణయాలు తీసుకున్నాడా?" అంటూ శ్రీశాంత్ ఘాటుగా ప్రశ్నించాడు.2013 స్పాట్ ఫిక్సింగ్‌లో శ్రీశాంత్‌ను పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ఆ సమయంలో ధోని వల్లే శ్రీశాంత్ కెరీర్ నాశనం అయ్యిందంటూ కామెంట్స్ కూడా వినిపించాయి. అయితే ఇప్పుడు శ్రీశాంత్ ధోనిపై ప్రశంసలు కురిపించడం కాస్త విచిత్రంగానే ఉంది.

# స్పోర్ట్స్

## అతడు మరో నాలుగేండ్లు ఆడుతాడు..

**-తేల్చి చెప్పిన ఆర్సీబీ సీఈవో రాజేష్ మీనన్**




ఐపీఎల్ చరిత్రలో విరాట్ కోహ్లీ, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుది విడదీయరాని బంధం. 2008 లీగ్ ప్రారంభమైనప్పటి నుంచి నేటి వరకు ఒకే ఫ్రాంచైజీ తరఫున 19 సీజన్లలో ఆడిన ఏకైక ఆటగాడిగా ఈ బ్యాటింగ్ దిగ్గజం నిలిచాడు. తాను జట్టు మారే ప్రణాళికలు లేవని, తన ఐపీఎల్ కెరీర్‌ను ఆర్సీబీతోనే ముగించాలనుకుంటున్నానని కోహ్లీ పలు సందర్భాల్లో స్పష్టం చేశాడు. ఆర్సీబీ అభిమానులు ఏళ్లుగా ఎదురుచూస్తున్న కలను నిజం చేస్తూ వరుసగా గత రెండు సీజన్లలో ఐపీఎల్ ట్రోఫీని గెలుచుకోవడం ద్వారా ఆర్సీబీ తమ టైటిల్ కరువును తీర్చుకుంది.ఈ క్రమంలో స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ ఐపీఎల్ భవిష్యత్తుపై రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు సీఈఓ రాజేశ్ మీనన్ కీలక వ్యాఖ్యలు చేశారు. కోహ్లీ మరో 3 నుంచి 4 ఏళ్ల పాటు ఐపీఎల్‌లో ఆర్సీబీ తరఫునే ఆడతారని ఆయన స్పష్టం చేశారు. రిటైర్మెంట్ తర్వాత కూడా కోహ్లీ ఫ్రాంచైజీతో కొనసాగుతారని పేర్కొన్నారు. అతను పూర్తి ఫిట్‌గా ఉన్నాడు. ఆట పట్ల అతనికి ఉండే తపన ఏమాత్రం తగ్గలేదు. ఈ ఐపీఎల్ సీజన్‌లో అతనిలో కనిపించిన ఉత్సాహం చూస్తుంటే మరికొంత కాలం ఆడేందుకు ఎలాంటి సమస్యా ఉండదని ఆయన స్పష్టం చేశారు. అనుభవజ్ఞుడైన విరాట్ లాంటి బ్యాటర్ జట్టుకు ఎంతో ఉపయోగకరమన్నారు.